జనరాజకీయం కోసం...

రూ॥ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి-1 సంచిక - 4 | పక్షపత్రిక | ఫిబ్రవరి 16-28, 2010





## దేశానికి కేంద్ర ప్రభుత్వం
## రాష్ట్రానికి రాష్ట్ర ప్రభుత్వం
## నగరానికి నగర ప్రభుత్వం





## వార్డుకి వార్డు ప్రభుత్వం



## జీవో 57 ఉపసంహారణకు లోక్‌సత్తా డిమాండ్









## గ్రామాలకు నేరుగా 7 శాతం నిధుల్ని అందించాలనే డిమాండ్‌తో...
## 8న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాలో పాల్గొన్న జయప్రకాష్ నారాయణ్

గ్రామపంచాయతీలకు భారత ప్రభుత్వం తన ఆదాయంలో 7శాతం నిధుల్ని నేరుగా అందించాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఫిబ్రవరి 08, 2010 న న్యూ ఢిల్లీలో జరిగే ధర్నాలో పాల్గొన్నారు. ఈ డిమాండ్ అమలైతే దేశ వ్యాప్తంగా పంచాయతీలకు ప్రతి ఏటా సుమారు రూ. 70,000 కోట్లు నేరుగా అందుతాయి.

రాష్ట్రీయ స్వాభిమాన్ ఆందోళన్ (ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఉ॥ 10 గం ॥ ల నుంచి మధ్యాహ్నం 2 గం॥ ల వరకూ ధర్నా జరిగింది. లోక్‌సత్తా పార్టీ మహారాష్ట్ర ఉత్తరప్రదేశ్ విభాగాలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నాయి.

స్వాభిమాన్ ఆందోళన్ కన్వీనర్ గోవిందాచార్యతో పాటు అధికార వికేంద్రీకరణ చేసి స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు ఇవ్వాలని పోరాడుతున్న పౌరసమాజ సంస్థలు, సామాజిక కార్యకర్తలు కూడా ధర్నాలో పాల్గొన్నారు.

# కర్తవ్యం



*"భారతదేశానికి స్వాతంత్ర్యం అంటే దేశం అంతటికీ స్వాతంత్ర్యం, ప్రజలందరికీ స్వాతంత్ర్యం. ఈ స్వాతంత్ర్యం గ్రామాల నుండి ప్రారంభం కావాలి. ప్రతి గ్రామం సర్వాధికారాలు కలిగిన రిపబ్లిక్ లేదా పంచాయతీ కావాలి. అప్పుడు ప్రతి గ్రామం స్వయంసమృద్ధం అవుతుంది. తన పనులన్నింటినీ తానే నిర్వహించుకోగలుగుతుంది."*

## లోపలిపేజీల్లో....


1. గవర్నర్ ప్రసంగం.. జేపీ స్పందన........................ 5
2. శాస్త్రీయ ఆలోచనా విధానం.. గన్‌రెడ్డి రాజారెడ్డి.................... 9
3. నాయకత్వ లక్షణాలు.. డా॥ పి. భాస్కరరావు......................11
4. మద్యం.. సంక్షేమానికి గొడ్డలిపెట్టు... బట్టు కోటేశ్వరరావు................12
5. జీవో 57ను ఉపసంహరించుకోవాలి............13
6. జలశుద్ధి యంత్రం ప్రారంభం...................20
7. సర్వజన సత్తా ..........................................21
8. మహిళాసత్తా............................................23
9. యువసత్తా...............................................24
10. నిర్దిష్ట ప్రణాళిక లేని ఉపాధి హామీల పథకం..25
11. రిజర్వేషన్ల బిల్లు రగడ................................26
12. అవినీతి నిరోధక బిల్లును ప్రవేశపెట్టాలి.........27
13. జిల్లా వార్తలు ..........................................28


# పిల్లలు, మహిళల అపహరణను హత్యానేరంగా పరిగణించాలి

**సంపాదకీయం**

చిన్నపిల్లల్ని, మహిళల్ని అపహరించే నేరాల్ని హత్యానేరంతో సమానంగా, ఉరిశిక్షకు అర్హమైన నేరంగా స్వీకరించేలా భారతీయ శిక్షాస్మృతిలో మార్పులు తీసుకురావాలి. విజయవాడలో నాగవైష్ణవి పాశవికహత్యకు పాల్పడిన వారికి, అందుకు ప్రేరేపించినవారికి 90రోజుల్లోపు ఉరిశిక్ష పడేలా విచారణ పూర్తి చేయాలి. హత్యకు పాల్పడ్డవారిని తక్షణం ఎన్‌కౌంటర్ చేయాలని ఆవేశపడటం అనాగరికం, అలాంటి ఘటనలు పునరావృతం కాకూడదంటే దోషులపై వెంటనే కఠినచర్యలు తీసుకునే విధంగా చట్టపరమైన పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవటం నాగరిక సమాజలక్షణం. అటువంటి దోషులకు కఠినశిక్షలు పడేందుకు... ఎవిడెన్స్ చట్టం, సీఆర్‌పీసీలో లోపాల్ని సరిచేసేలా ఎటువంటి మార్పులు చేయాలో 2003లో జస్టిస్ మాలిమత్ కమిటీ ఆచరణాత్మక సిఫార్సుల్ని చేసింది. రాజకీయపార్టీలు, ప్రభుత్వం తాత్కాలిక సానుభూతులు, పరామర్శలకు పరిమితం కాకుండా వాటిని వెంటనే అమలుచేసే దిశగా చర్యల్ని ప్రారంభించాలి.

ముక్కుపచ్చలారని నాగవైష్ణవి దారుణ హత్యను తట్టుకోలేక ఆ పాప తండ్రి మరణించటం, వారిద్దరికంటే ముందు ఆ కుటుంబాన్ని కాపాడేందుకు వారి కారు డ్రైవర్ ప్రాణాలివ్వటం సమాజమంతా అంతర్ముఖులు కావాల్సిన అవసరాన్ని చాటి చెబుతున్నాయి. ఎన్నో విలువలు, నాగరికత, పాపభీతి ఉన్నాయనుకుంటున్న సమాజం... కేవలం ఆస్తులకోసం, మాత్సర్యంతో ఘోరహత్యలు చేసే స్థాయికి దిగజారుతోందంటే, అందుకు సమాజంలో నేతలు, పౌరసమాజ ప్రముఖులు, మతపెద్దలు కూడా సిగ్గుపడాల్సి ఉంది. "ప్రజలకు ఆదర్శంగా నిలిచి వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన వారంతా ప్రజల్లో ద్వేషాన్ని, మాత్సర్యాన్ని పెంచిపోషిస్తున్నారు. ఎక్కడో మనం దారి తప్పాం. దాని పర్యవసానాలే ఇలాంటి దారుణ అకృత్యాలు" బైటికెళ్లిన తమ పిల్లలు ఏమైపోతారో అని ఈరోజు రాష్ట్రంలో అందరూ వణికిపోవటాన్ని మించిన వైఫల్యం సమాజానికి మరోటి లేదు. సమాజంలో మంచి, చెడుల మధ్య తేడా చెరిగిపోతోంది. దీన్ని కులమతాలకతీతంగా సమాజం ఎదుర్కోకపోతే ఎంత సంపాదించినా, ఏ స్థాయిలో ఉన్నా ఏమీ ప్రయోజనం ఉండదు. దీన్ని కేవలం పోలీసులకు, ప్రభుత్వానికి సంబంధించిన విషయంగా కాకుండా మొత్తం సమాజం తన బాధ్యతగా స్వీకరించాల్సి ఉంది. వైష్ణవి కుటుంబసభ్యులకు లోక్‌సత్తా పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి.

**అడుగు తర్వాత అడుగు వేసుకుంటూనే ఏ నిచ్చెనైన ఎక్కడం అవసరం - అర్బత్‌నాట్**

# లోక్‌సత్తా టైమ్స్ - కొత్త రాజకీయ పక్షపత్రిక

**ఫిబ్రవరి 16-28, 2010 సంపుటి - 1 సంచిక - 4**

ప్రధాన సంపాదకులు : డా॥ జయప్రకాష్ నారాయణ్

సంపాదకవర్గం : జి. రాజారెడ్డి
సి.హెచ్. మాధవరావు
గరిమెళ్ళ నారాయణ
కె.వి. కుటుంబరావు

వర్కింగ్ ఎడిటర్ : కొంగర గంగాధర రావు

ప్రచురణ కర్త : డా॥ జయప్రకాష్ నారాయణ్
ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తరపున,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ముద్రణ : కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లి., 1-1-60/5, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, హైదరాబాద్

**పోస్ట్ బాక్స్ నెంబర్ 100, హైదరాబాద్ - 500 004**


# మన రాజ్యాంగం

## ఆర్టికల్ - 4

**మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా చూపే వివక్షత నిషేధం**

1. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా రాజ్యం పౌరులపట్ల వివక్షతను చూపరాదు.
2. మత, జాతి, కుల, లింగ, జన్మస్థానం కారణంగా ఏ పౌరుడూ ఏ విధమైన అనర్హతలకు, బాధ్యతలకు, ప్రతిబంధకములకు గురి చేయబడరాదు.
   ఎ) ప్రత్యేకముగా ప్రజలందరూ ఉపయోగించే షాపులు, హోటళ్ళు, విశ్రాంతి, వినోద గృహములు స్థలములు అనుభవించుటయందు
   బి) సర్వజనుల ఉపయోగార్థం పాక్షికంగా కానీ, పూర్తిగా కానీ రాజ్య నిధులతో నిర్వహింపబడుతున్న బావులు, చెఱువులు, స్నానఘట్టాలు, రహదారులు, విహారస్థలాలను అనుభవించుటలో ఏ వ్యక్తిని అభ్యంతర పెట్టరాదు. ఆంక్షలు విధించరాదు.
3. అయినప్పటికీ ఈ ఆర్టికల్‌లోని అంశములు స్త్రీలకు మరియు పసివారి సంక్షేమం కొరకు ప్రత్యేక రక్షణలను ఏర్పరుచుటయందు రాజ్యమునకు ఉన్న అధికారమునకు అడ్డురావు.
4. ఈ ఆర్టికల్‌లోని అంశములు మరియు ఆర్టికల్ 29 క్లాజ్ (2)లోని అంశములు షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికి మరియు సాంఘికముగాను, విద్యలోను వెనుకబడిన ఇతర తరగతుల వారికి ప్రత్యేక రక్షణలను ఏర్పరుచుటయందు రాజ్యమునకు ఉన్న అధికారమునకు అడ్డురావు.
5. పైన ఉదహరించిన అంశములు షెడ్యూల్ కులముల వారికీ, షెడ్యూల్ తరగతులవారికీ, మరియు వెనుకబడిన తరగతుల వారికీ విద్యావకాశాలలో కల్పించు రక్షణలను ప్రైవేట్ విద్యా సంస్థలలో, అవి ప్రభుత్వంచేత సహాయమును పొందుచున్న లేక పొందినవైనా, ఏర్పరచుటయందు రాజ్యమునకు ఉన్న అధికారమునకు అడ్డురావు. అయితే, ఈ అధికారము అల్ప సంఖ్యాక వర్గాలు ఏర్పరచుకొను సంస్థలకు వర్తించదు.

**మీరూ రాయండి :** *లోక్‌సత్తా టైమ్స్ మీ పత్రిక. పత్రికలో మీకు నచ్చినవీ, నచ్చనివీ, కోరుకుంటున్నవీ... ఏవైనా మాకు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా తెలియజేయండి. కొత్త రాజకీయానికి ప్రజల్ని కేంద్రబిందువుగా తీర్చిదిద్దేందుకు ఈ పత్రికను ఉపయోగించుకోండి.*

**పుస్తకాలు లేని గది, ఆత్మలేని శరీరం లాంటిది - సిసిరో**

# సమాచారం పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పక్షపత్రిక ఎటువంటి భావజాలంతో వెలువడుతుందో మీ అందరికీ తెలుసు, ఇందుకు అనుగుణమైన సమాచారాన్ని ఎవరైనా నేరుగా పత్రిక చిరునామాకు పంపవచ్చు. లోక్‌సత్తా పార్టీ స్థానిక కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని (వీలైతే ఫొటోలతో పాటు) ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించండి. ప్రచురణార్హమైన రచనల్ని వీలుని బట్టి వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజీ | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |
| ఫ్రంట్‌పేజీ 1/4 | - | రూ॥ 10,000 |

- ప్రకటన రుసుము Foundation for Democratic Reforms పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.
- దయచేసి మీ ప్రకటనలు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించగలరు.
- ప్రకటన రుసుము ముందుగానే చెల్లించగలరు


## మీ ఫీడ్‌బ్యాక్ పంపవలసిన చిరునామా


ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,
ఫ్లాట్ నం. బి 504, పాషాకోర్టు, సోమాజిగూడ,
హైదరాబాద్ - 500 082
loksattatimeslsp@gmail.com


## లోక్‌సత్తా టైమ్స్ చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. లోక్‌సత్తా అభిమానులకు, పార్టీ సభ్యులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తుంది.

విడి ప్రతి : రు. 10
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500


బుక్ & కవర్ డిజైన్: **సునీత అరిమిల్లి**
డి.టి.పి : **టి. జ్యోతి**

# అవినీతి, నిరుద్యోగం, విద్యుత్ సంక్షోభం వంటి కీలక సమస్యలపై దాటవేత



## గవర్నర్ ప్రసంగంపై జేపీ స్పందన

***క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే లోక్‌సత్తా దత్తతకు తీసుకున్న మహబూబ్‌నగర్ జిల్లా ఐజ మండలం కేశవరం గ్రామంలో ఒక్క ఇంటికీ ఇంత వరకు పునాది పడలేదు. తుంగభద్రకు వరద వచ్చి పొలాల్లో ఇసుకమేటలు వేస్తే ఒక్క ఎకరం పొలానికి ప్రభుత్వం ఋణంగాని, సబ్సీడీ గాని అందలేదు. వరద వచ్చింది అక్టోబరులో, ప్రస్తుతం ఫిబ్రవరి మాసం నడుస్తోంది. మరి ప్రభుత్వం మంజూరు చేసినట్టు చెబుతున్న డబ్బులు ఏమయినట్లు?***

ఫిబ్రవరి 15న గవర్నర్ ఉభయ సభల్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం కొన్ని సాఫల్యాల్ని చెప్పుకుంటూ, కీలక వైఫల్యాల్ని దాటవేసి "It is like a curate's egg – good in parts – bad in parts" అనే ఇంగ్లీషు సామెత చెప్పినట్లుగా వుంది.

ఇందులో మంచి ఏమిటంటే మొదటిది, ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయరంగంలో రైతు చేసిన ఉత్పత్తికి అదనపు విలువని చేకూర్చడం ఖచ్చితంగా చాలా అవసరం. ఆ పని జాతీయస్థాయిలో మొదలుపెట్టినా, రాష్ట్ర స్థాయిలో పట్టించుకోలేదు. కాగితాలకే పరిమితం కాకుండా, నిజాయితీగా రైతు ఉత్పత్తికి అదనపు విలువలు వచ్చే ఏర్పాట్లు ప్రారంభం కావాలి. రెండవది, మూడు రంగాల్లో మనం బాగున్నామన్నారు. కొత్త పెట్టుబడుల్లో, ఎన్.ఆర్.ఇ.జి.పి. వినియోగంలో, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్‌లో మొదటిస్థానంలో ఉన్నామన్నారు. ఇది ప్రభుత్వాన్ని అభినందించతగ్గ విషయం. ఇంకో కొత్త విషయం విశాఖపట్నం-కాకినాడ పెట్రో కెమికల్స్ కారిడార్ అభివృద్ధి చేస్తామనడం. ఇది చాలా అవసరం. ఇప్పటికే చాలా ఆలస్యమయింది. ఇక మరో చెప్పుకోదగ్గ అంశం ప్రపంచబ్యాంకు నిధులతో గాని, ప్రభుత్వ, ప్రయివేట్ రంగం భాగస్వామ్యంతో నిధుల కేటాయింపు చేసి రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పెద్ద యెత్తున గట్టిగా చేపడతామనడం సంతోషకరం.

కాని, ప్రస్తావనకు నోచుకోని, పూర్తిగా దారిమళ్ళుతున్న అంశాలు చాలా వున్నాయి. మొట్టమొదటిది క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్. ఆర్థికమాంద్యం ఎంతవున్నా, బడ్జెట్ కష్టాలు ఎన్ని వున్నా పెట్టుబడులు తగ్గకూడదు. ఆస్తుల్ని అమ్ముకోవడం విజ్ఞత కాదు. అప్పుల్ని పెట్టుబడుల కోసం ఉపయోగించాలి. అప్పుల భారం పెరుగుతుండగా, క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ తగ్గి, నెగటివ్‌లోకి వెళ్ళిందన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ వృద్ధి రేటు తగ్గి ఆ గ్రోత్ రేటు తగ్గితే ఫర్వాలేదు. కానీ, పెట్టుబడి నెగటివ్‌లోకి వెళ్ళడమనేది చాలా ప్రమాదకరమైన ధోరణి. దీనిని ఖచ్చితంగా పరిశీలించాలి.

ఇక రెండవది, ఫ్యాన్సీ ఐటమ్స్ ప్రస్తావన. దీర్ఘకాలిక దృష్టిలేదు. ఉదాహరణకు హైదరాబాదు నగరంలో గ్యాస్‌గ్రిడ్ పెట్టడం. కావల్సింది హైదరాబాదులో గ్యాస్‌గ్రిడ్ కాదు. నగరంలో గ్యాస్‌గ్రిడ్ పెడితే గ్యాస్‌పైపు నించి గ్యాస్ తీసుకుంటాం. లేకపోతే గ్యాస్ సిలిండర్ వస్తుంది. కాని రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి కావాలి. రాష్ట్రంలో పారిశ్రామిక గ్యాస్ గ్రిడ్ కావాలి. గుజరాత్‌లో గ్యాస్ ఎలోకేషన్ లేకుండానే ఏడు గ్యాస్ పైపులైన్లను గ్రిడ్ కోసం ముందుచూపుతో ఏర్పాటు చేసుకున్నారు. మనకు దాదాపు రెండు వందల మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ వచ్చే అవకాశం ఉంది. పరిశ్రమల కోసం వాడాలని చెబుతూ రాష్ట్రంలో పారిశ్రామిక గ్యాస్‌గ్రిడ్ గురించి మాట్లాడకుండా, హైదరాబాదులో వంటింటి గ్యాస్‌గ్రిడ్ అంటున్నారు. అంటే ప్రభుత్వానికి ఆర్థికాభివృద్ధి గురించిన అవగాహన కాని, ఆలోచన కాని లేవు.

మూడవది, మొన్నటి వరదల్లో ప్రభుత్వం, ప్రైవేటు రంగం, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, పత్రికలు, టి.వి. ఛానళ్ళు చాలా బాగా స్పందించాయి. ఇది అభినందనీయం. కాని దీర్ఘకాలిక చర్యలేవి? ప్రాణాలు రక్షించడం, తాత్కాలిక సేవలందించటం అభినందనీయమే. కాని దీర్ఘకాలిక సంగతి ఏమిటి? వరదప్రాంతాల్లో ఇందిరా ఆవాస్‌యోజన క్రింద ఒక్కొక్క ఇంటికి రూ. 68,450/- లు మంజూరు చేసారు. కానీ ఇది కాగితాలకే పరిమితమయింది. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే లోక్‌సత్తా దత్తతకు తీసుకున్న మహబూబ్‌నగర్ జిల్లా ఐజ మండలం కేశవరం గ్రామంలో ఒక్క ఇంటికీ ఇంత వరకు పునాది పడలేదు. తుంగభద్రకు వరద వచ్చి పొలాల్లో ఇసుకమేటలు వేస్తే ఒక్క ఎకరం పొలానికి కూడా ప్రభుత్వ ఋణంగాని, సబ్సీడీ గాని అందలేదు. వరద వచ్చింది అక్టోబరులో, ప్రస్తుతం ఫిబ్రవరి మాసం నడుస్తోంది. మరి ప్రభుత్వం మంజూరు చేసినట్టు చెబుతున్న డబ్బులు ఏమయినట్లు? సహకార బ్యాంకుల నుంచి గాని, వాణిజ్య బ్యాంకుల నుంచి గాని రైతులకు ప్రభుత్వం ఋణం ఇప్పించ లేకపోయింది. రైతులు అప్పులు చేసి వంద ఎకరాల పొలాన్ని బాగు చేసుకుంటే రెండువందల ఎకరాల్లో ఇసుకమేటలు అలాగే వున్నాయి. అంటే డబ్బు లేకపోవడం కాదు.

ప్రభుత్వ యంత్రాంగం పనితీరులో వున్న మౌలికమైన లోపం ఇది. ఇక దీర్ఘకాలిక వరద నివారణ చర్యలు. మొన్న వచ్చిన వరదలు అసాధారణమైనవి. కానీ భవిష్యత్తులో రావన్న నమ్మకం ఏమిటి? ఇరవై ఐదు లక్షల క్యూసెక్కుల నీరు కృష్ణానదిలోకి రావడం చరిత్రలో మనం వినని విషయం. వీటిని తట్టుకునేటట్లుగా శాశ్వత కరకట్టల నిర్మాణం గురించి గానీ, ఫ్లడ్ ప్రూఫింగ్ గురించి గానీ చెప్పకపోవడం, తాత్కాలికమైన ఏర్పాట్లు తప్ప, దీర్ఘకాలికంగా బాగుచేయడానికి గూర్చిన అవగాహన ప్రభుత్వంలో కొరవడిందని గవర్నర్ ప్రసంగం స్పష్టం చేస్తుంది.

**ఇక వ్యవసాయ రంగం:** గత ఐదేళ్ళలో ఏటా 8.98 శాతం ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగిందని ప్రభుత్వం చెప్పుకుంటోంది. వ్యవసాయ రంగంలో దేశంలో 3,4 శాతం అభివృద్ధి వుంటే రాష్ట్రంలో 6 శాతం అభివృద్ధి వుందన్నారు. కానీ గత సంవత్సరం రాష్ట్రంలో ఋణ మాఫీ ద్వారా పదమూడు వేలకోట్ల రూపాయాలు, తీసుకున్న ఋణాలు తీర్చిన రైతులకు ఐదువేల రూపాయల ప్రోత్సాహకం, మరెన్నో సబ్సిడీలను రైతులకు అందించారు. అయినా కొన్తంత దుర్భిక్ష్యానికి గురికాగానే ఒక్కసారి నలభైలక్షల టన్నుల ఆహారధాన్యం ఉత్పత్తి పడిపోయింది. వేల, లక్షల కోట్ల రూపాయలు ఏళ్ళ తరబడి ఖర్చు పెట్టినా, జలయజ్ఞం గురించి మాటలు చెప్పుకున్నా, వరుణదేవుడు ఒక్క సంవత్సరం కరుణించక రెండుమూడు నెలలు వర్షాలు సరిగ్గా పడకా, ఆ తర్వాత వర్షాలు ఎక్కువై వరదలు వచ్చి, వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఉచిత విద్యుత్‌తో రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతున్నా వరుణదేవుడు కరుణించకపోతే నెగటివ్ గ్రోత్‌లో పడిపోతున్నాం. అంటే వరుణుడి కటాక్షమే మన గొప్పతనమని భావించాలి. వేల కోట్లు ఓట్ల కోసం పంపిణీ చేస్తున్నాం తప్ప వ్యవసాయాన్ని, గ్రామాలని బాగుచేయలేక పోతున్నాం. మన విధానాల్లో, వాటి అమలులో వున్న మౌలికమైన లోపం ఇది.

**ఇక ఆర్థిక నిర్వహణ:** చేసిన ఖర్చుకి ఫలితం వచ్చే ఏర్పాటు చేయకపోతే, ఎంత ఖర్చుపెట్టినా ఉపయోగం లేదు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే 3,638 కోట్ల రూపాయలు ఖర్చు కాగా ఒక్క ఎకరం కూడా సాగులోకి రాలేదు. అంటే నెమ్మదినెమ్మదిగా 10% ఖర్చుపెట్టి వడ్డీభారం పెంచేసి రాష్ట్రం నడ్డి విరగగొట్టడమే తప్ప ప్రాధమ్యాల ప్రకారం చేపట్టి, పెట్టిన ఖర్చుకి ఫలితాలు వెంటనే ఇచ్చి వ్యవసాయాన్ని, గ్రామాల్ని బాగుచేద్దామన్న స్పృహలేదు. ఖర్చు చూపెడుతున్నారు. కాని ప్రజల ప్రయోజనాన్ని చూపెట్టడం లేదు. డబ్బుని ఖర్చుపెట్టే పథకాలని పునస్సమీక్ష చేసి రీఓరియంట్ చేసి పద్ధతి ప్రకారం ఖర్చుపెడితే రైతులకు న్యాయం జరుగుతుంది. రాష్ట్రం బాగుపడుతుంది. 2013, 2017లో అన్ని పథకాలు పూర్తవుతాయని ఊరించే కంటే సంవత్సరానికి

**జాతీయ ఆరోగ్య మిషన్ని వ్రాసిన వాడిగా నా స్పష్టమైన అభిప్రాయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆరోగ్యం అంటే కనీస అవగాహన లేదు. వేలాది కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడమే తప్ప ప్రజలకి ఆరోగ్యం సాధించాలంటే దీనిని పునఃసమీక్షించటం ఎలాగో తెలియదు. ఇప్పటికయినా విద్యని, ఆరోగ్యాన్ని ప్రజలకు అందించే ఏర్పాట్లు నిజాయతీతో చేయకపోయినట్లయితే ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా ప్రజాధనం వృధా అవుతుందే తప్ప ప్రజలకు న్యాయం జరగదు.**

2,3 పథకాలు ప్రతిజిల్లాలో పూర్తి చేయాలి. ఆర్థిక భారం ఎంత వున్నా ఖర్చు పెట్టేచోట ఖర్చుపెట్టాలి. రైతు అప్పులపాలు అవుతాననే భయంతో విత్తనాలు కొనడం కోసం వెరచినట్లయితే వచ్చే సంవత్సరం పంటరాదు. ఆర్థికాభివృద్ధికి కావలసిన విషయంలో అవసరానికి ఖర్చు పెట్టకపోయినా, అనవసరానికి ఖర్చు పెట్టి ఫలితం రాకుండాపోయినా, రెండు రకాలుగా దివాళాతీస్తాము. ఆర్థిక నిర్వహణ విషయంలో వెసులుబాటు ప్రదర్శించాలి.

**విద్యుత్‌రంగం:** పుష్కలంగా వర్షాలు, వద్దన్నా వానలు, వరదలు వచ్చి రిజర్వాయర్లు అన్నీ నిండిన తరువాత కూడా రాష్ట్రంలో విద్యుత్ కొరత అంటే విద్యుత్ నిర్వహణ ఎంత బాధాకరంగా వుందో తెలుస్తుంది. ప్రసంగంలో కొత్త విద్యుత్ ప్రతిపాదనలు, ఎన్ని వేల మెగావాట్ల ప్రాజెక్టులు మొదలుపెట్టాము. అనే దివాళా



తీసే ప్రకటనలే తప్ప విద్యుత్ పంపిణీని బాగుచేయడం కాని, రాష్ట్ర విద్యుత్‌రంగంలో వున్నలోటును నివారించడం ఎట్లా అన్న ఆలోచన కాని సూచన మాత్రంగా కూడా తెలియచేయలేదు.

**విద్యా,ఆరోగ్యం:** ఆరోగ్యంలో 104, 108 ఆరోగ్యశ్రీ, అలాగే విద్యారంగంలో సర్వశిక్షా అభియాన్, సెకండరీ ఎద్యుకేషన్ మిషన్ వంటి పథకాల్లో కేటాయింపులు, ఖర్చుల గురించి మాట్లాడుతున్నామే తప్ప ఫలితాల్ని గురించి మాట్లాడటం లేదు. విద్యారంగంలో యాన్యువల్‌స్టేటస్ ఎద్యుకేషన్ రిపోర్టు కాని, ప్రభుత్వ అధ్యాపకులచే చేయించిన సర్వే రిపోర్టు కాని ఒకే మాట చెబుతున్నాయి. స్కూలు పిల్లల్లో 7వ తరగతిలో 30%-40% మందికి చదవడం రాయడం రావడం లేదు. 60 శాతం మందికి చిన్న చిన్న లెక్కలు రావడం లేదు. ఆరోగ్యం రంగంలో చూస్తే వ్యాధులు ప్రబలుతూనే వున్నాయి. డెంగ్యూవ్యాధికి వేలాదిమంది చనిపోతుంటే దోమల్ని నియంత్రించలేనటువంటి వ్యవస్థ మనది. ప్రజారోగ్యం అంటే కనీసం అర్థంకాని వ్యవస్థ మన పాలకులది. ఇది ఒక వైద్యుడిగా, ప్రజారోగ్యం పట్ల లోతైన స్పృహ వున్న వాడిగా, జాతీయ ఆరోగ్య మిషన్‌ను వ్రాసిన వాడిగా నా స్పష్టమైన అభిప్రాయం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆరోగ్యం అంటే కనీస అవగాహన లేదు. వేలావేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడమే తప్ప ప్రజలకి ఆరోగ్యం సాధించాలంటే దీనిని పునఃసమీక్షించటం ఎలాగో తెలియదు. ఇప్పటికయినా విద్యని, ఆరోగ్యాన్ని ప్రజలకు అందించే ఏర్పాట్లు నిజాయితీతో చేయకపోయినట్లయితే ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా ప్రజాధనం వృధా అవుతుందే తప్ప ప్రజలకు న్యాయం జరగదు.

**మైనింగ్‌పాలసీ:** ఫస్టుకు ఫస్టు సర్వ్డు అని చెప్పి ఇష్టమైన వాడితో అప్లికేషన్ పెట్టించి,

5 నిమిషాల ముందు నోటిఫికేషన్ పెట్టించి వాళ్ళు ఇచ్చిన కాగితమే మొదటిదని చెప్పి, ఇచ్చినంత కాలం బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం వుంటుంది. ప్రజాధనానికి నిజమైన పోటీ వుండదు. లాభాలు రాష్ట్ర ఖజానాకు వెళ్ళాలి కానీ కొందరి జేబుల్లోకి కాదు. ప్రభుత్వరంగంలో ఫ్యాక్టరీలకు, స్టీలు ప్లాంటు కాని, మరోటి కాని – కావలసిన మేరకు ఖనిజాన్ని కేటాయించాలి. వాటిని వదిలివేసి ప్రైవేటు రంగానికి పెద్దపీట వేయడం సరికాదు. విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ ట్యాక్స్ వుండాలి. ఫస్టు కం ఫస్ట్ సర్వ్డు బేసిస్ కాకుండా కాంపిటీటివ్ బిడ్డింగ్ పెట్టి అంతర్జాతీయ మార్కెట్‌లో వున్న పరిస్థితులను బట్టి ఖనిజానికి డిమాండ్ ఎంత ఉందో చూసి, ఎవరు ఎక్కువ రేటు ఇస్తామంటే వారికి ఇచ్చే ఏర్పాటు చేయాలి. అంతేకాని ఖనిజాల మీద అత్యధికంగా రెవెన్యూ వస్తుందని మురిసిపోతే వచ్చేది 10 రూపాయలు అయితే, పోయేది 100 రూపాయలు అవుతుంది.

ఇక మరో మూడు ముఖ్యమయిన విషయాల ప్రస్తావన పూర్తిగా విస్మరించారు. ఒకటి, అవినీతి విశృంఖలమై వేలాది కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని తరలించుకు పోతున్నారు. అవినీతిని అంతం చేస్తామనే మాట గవర్నర్ నోట రాలేదంటే అవినీతే ప్రభుత్వ విధానమా లేక అవినీతిని మార్చలేమని ప్రభుత్వం పూర్తిగా చేతులు ఎత్తి వేసిందా? గతంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేతీర్మానం చర్చలో లోక్‌సత్తా తరపున అవినీతి నిరోధక బిల్లు ముసాయిదా చూపించడం జరిగింది. ప్రభుత్వానికి, ప్రధాన ప్రతిపక్షానికి మా మనవి. అవినీతి నిరోధం కోసం అవినీతిపరుల భరతం పట్టడం కోసం, కఠినమైన చట్టాన్ని తీసుకొని వచ్చి ప్రజలకు న్యాయం చేయండి.

రెండు, రాజ్యాంగ సవరణ వచ్చి 16 సంవత్సరాలు అయ్యాయి. మన ఫెడరల్ వ్యవస్థలో మూడో అంచె వ్యవస్థలు స్థానిక ప్రభుత్వాలు. ఆంధ్రప్రదేశ్‌లో అవి అత్యంత పేలవంగా వున్నాయి. అధికారం మొత్తం ఎమ్మెల్యేలు, అధికారుల చేతుల్లో పెట్టి ప్రజలకు నిరాశ మిగిల్చారు. మనం చేతిలో అధికారం పెట్టకపోవడం చేత ఆక్రోశం, అధికారం పంచుకోవాలనే ఆరాటంతో కసి– ప్రజలకు శాసనసభ మీద, ప్రభుత్వాల మీద రాజకీయాల మీద ద్వేషం రగిలి దేశాన్ని ఉద్యమాల కుంపటిగా మారుస్తోంది. జనం చేతుల్లో అధికారాన్ని పెట్టి వారు కట్టిన డబ్బులు వారికి సద్వినియోగమవు తున్నాయన్న నమ్మకాన్ని కలుగజేసి, వారు వేసే ఓటు వల్ల వారికి మంచి జరుగుతుందన్న విశ్వాసాన్ని కలుగజేసి, అధికారం ఎక్కడ వుందో అక్కడ బాధ్యతను ఇచ్చి, ప్రజాస్వామ్యాన్ని సార్థకం జేయడం మన లక్ష్యం కావాలి. కేవలం ఎన్నికలు జరపడం కాకుండా, రాజ్యాంగాన్ని గుర్తించి స్థానిక ప్రభుత్వాలకు అధికారం ఇవ్వాలి.

**అవినీతి విశృంఖలమై వేలాది కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని తరలించుకు పోతున్నారు. అవినీతిని అంతం చేస్తామనే మాట గవర్నర్ నోట రాలేదంటే అవినీతే ప్రభుత్వ విధానమా లేక అవినీతిని మార్చలేమని ప్రభుత్వం పూర్తిగా చేతులు ఎత్తి వేసిందా?**

మూడు, గత 15 ఏళ్ళుగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అభివృద్ధి నమూనా ఏమీ మారలేదు. అభివృద్ధి అంతా హైదరాబాదు చుట్టూనే కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పించలేకపోయిన అభివృద్ధి గ్రామీణులు, రైతుల ఆత్మహత్యలను పెంచే అభివృద్ధి. 9% అభివృద్ధి కనిపించిన 5 ఏళ్ళ కాలంలో పేదరికం తగ్గలేదు. ఉపాధి పెరగలేదు. ఉపాధి కోసం ఇంకా రాష్ట్ర యువత హైదరాబాదుకో, ముంబాయికో, బెంగుళూరుకో, చెన్నైకో తరలిపోవడం సిగ్గుచేటు. దీనికి విరుగుడు వికేంద్రీకృతమైన అభివృద్ధి. రాష్ట్రంలో కనీసం వేయి చిన్న పట్టణాలను ఏర్పాటు చేసి ప్రతి చిన్న పట్టణానికి మౌలిక సదుపాయాలను కల్పించాలి. అక్కడ నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం శిక్షణ ఇచ్చి పరిశ్రమల కోసం ప్రోత్సాహకాలు ఇచ్చి అభివృద్ధి ఫలాలు అందరికీ పంచాలి. ఎన్ని పరిశ్రమలకు ఎన్ని వేల కోట్ల రూపాయల సబ్సిడీ ఇచ్చారన్నది కాదు.



ఇక చివరగా గవర్నర్ ప్రసంగంలో గాంధీజీ Talismen ను ఉదహరించారు. గాంధీజీ మారుమూల గుడిసెలో వున్న వాడికి సాయం చెయ్యమని చెప్పలేదు. ఆ సామాన్యుడి జీవితం మీద అధికారం పెంచుకునేందుకైతే ఆ పని చేయమన్నారు. ప్రజలశక్తి సామర్థ్యాలు పెంచండన్నారు. జవసత్వాలను, ఆత్మస్థైర్యాన్ని పెంచండన్నారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచమన్నారు. 'వాళ్ళను సంపద సృష్టించే పౌరులుగా తయారుచేయండి కాని బికారులుగా, బిచ్చగాళ్ళుగా తయారు చేయకండి. మీరిచ్చే ఎంగిలి మెతుకుల కోసం నిరంతరం వేచి వుండే వాళ్ళుగా తయారుచేస్తే ఈ దేశంలో వుండేది పౌరులు కాదు. బిచ్చగాళ్ళ'ని మహాత్మాగాంధీ, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నోసార్లు స్పష్టంగా చెప్పారు. గవర్నరు ప్రసంగంలో వచ్చిన ఈ మాటలను దయచేసి ప్రభుత్వంలోని పెద్దలు అర్థం చేసుకోవాలి.

ఇక ఒక తహశీల్దారు గారున్నారు. ఆయన కాన్ఫిడెన్షియల్ రిపోర్టులో కలెక్టరు, ఇరవై సంవత్సరాల అనుభవం కలిగిన తహశీల్దారు అని వ్రాసారు. ఆపై అధికారి నేనొప్పుకోను. ఒక్క సంవత్సరంఅనుభవాన్ని ఇరవై సంవత్సరాలు రిపీట్ చేసిన తహశీల్దారు ఆయన'' అని వ్రాసారు. ఈవేళ జరుగుతున్నది అదే. గత అనుభవాన్ని బేరీజు వేసుకొని భవిష్యత్తును నిర్మించుకోవడమే కాకుండా గత అనుభవం నుంచి పాఠాలు నేర్చుకొని, పంథాని అవసరమైన చోట మార్చుకోవాలి. ఎంతసేపు చర్విత చరణంలా పాత చింతకాయ పచ్చళ్ళు, పాత విధానాలు, పాత మాటలు తప్ప, ఈ దేశ అవసరాలు, ఈ జాతి అవసరాలు, ఈ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజల అవసరాలు పట్టించుకునే శక్తి లేనటు వంటి దురవస్థ మనది. గవర్నర్ ప్రసంగం లోని చాలా భాగాలు దీనికి ఉదాహరణ. ■

## ముంబయిలో ఉద్రేకాలను రెచ్చగొట్టవద్దు : జేపీ విజ్ఞప్తి

ముంబయి భారతీయులందరిదీ, ఉద్యోగవ్యాపారాల కోసం భారతీయులు దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లకుండా ఆపే అధికారం ఎవరికీ లేదని ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) చీఫ్ మోహన్ భగవత్ స్పష్టంగా ప్రకటించటాన్ని లోక్‌సత్తా పార్టీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది.

"భారత ఆర్థిక రాజధానిలో కొందరు రాజకీయనేతలు భాష పేరుతో విద్వేషపు మంటల్ని ఎగదోయటం చాలా ఆందోళనకరమైన అంశం. జీవించటం, జీవనోపాధి, నివాసం, ప్రయాణం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, వృత్తి తదితర అంశాలకు సంబంధించిన విషయాల్లో దేశవ్యాప్తంగా పౌరులంతా ఒకటే. రాజ్యాంగం చెబుతున్నది కూడా ఇదే. దేశప్రయోజనాల దృష్ట్యా జమ్మూకాశ్మీర్, కొన్ని ఈశాన్య రాష్ట్రాలలో మాత్రమే కొన్ని నియంత్రణలు అమలులో ఉన్నాయి.

రాజకీయపార్టీలు, పౌరసమాజ సంస్థలు ఓటుబ్యాంకు రాజకీయాల కోసం, స్వార్థప్రయోజనాల కోసం కులం, మతం, ప్రాంతం, భాషకు సంబంధించి ప్రజల్లో భావోద్రేకాలను రెచ్చగొట్టవద్దు. దేశసమైక్యతను, ఐకమత్యాన్ని కాపాడటం ప్రతి భారతీయుని అత్యున్నత కర్తవ్యం. జాతీయతకు బద్ధులు కావటం... ప్రజాప్రయోజనార్థం పాలనాపరమైన, రాజకీయ పరమైన ఏర్పాట్లు చేసుకోవటానికి ఎంతమాత్రం అవరోధం కాదు".అని లోక్‌సత్తా అధ్యక్షుడు జేపీ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## గ్రామాలకు నేరుగా నిధుల కోసం... ఢిల్లీలో ధర్నాలో పాల్గొన్న జయప్రకాష్ నారాయణ్

గ్రామపంచాయతీలకు భారత ప్రభుత్వం తన ఆదాయంలో 7శాతం నిధుల్ని నేరుగా అందించాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఫిబ్రవరి 08, 2010 న న్యూఢిల్లీలో జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ డిమాండ్ అమలైతే దేశవ్యాప్తంగా పంచాయతీలకు ప్రతి ఏటా సుమారు రూ.70,000కోట్లు నేరుగా అందుతాయి.

రాష్ట్రీయ స్వాభిమాన్ ఆందోళన్ (ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఉదయం 10గం॥ల నుంచి మధ్యాహ్నం 2గం॥ల వరకూ ధర్నా జరిగింది. లోక్‌సత్తా పార్టీ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ విభాగాలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

స్వాభిమాన్ ఆందోళన్ కన్వీనర్ గోవిందాచార్యతోపాటు అధికార వికేంద్రీకరణ చేసి స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు ఇవ్వాలని పోరాడుతున్న పౌరసమాజ సంస్థలు, సామాజిక కార్యకర్తలు కూడా ధర్నాలో పాల్గొన్నారు.

## పార్టీల రహితంగా మున్సిపల్ ఎన్నికల ప్రతిపాదన పరిశీలించదగ్గదే: జేపీ

మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలను పార్టీల ప్రమేయం లేకుండా నిర్వహించాలని ఇటీవల ముఖ్యమంత్రి రోశయ్య చేసిన ప్రతిపాదన పరిశీలించదగ్గదేనని లోక్‌సత్తా పార్టీ అభిప్రాయపడింది. ప్రజలకు రాజకీయభాగస్వామ్యం కల్పించాల్సిన పార్టీలు...కులం, మతం, ప్రాంతం వంటి విద్వేషాల మధ్య కూరుకుపోయి పరస్పరం కత్తులు దూసుకుంటున్నాయి. సైద్ధాంతిక పోరాటం స్థానంలో పార్టీలు వ్యక్తిగత పోరాటానికి వేదికలుగా మారాయి. ఈ తరుణంలో పార్టీల రహితంగా నగరస్థాయి ఎన్నికలను నిర్వహించటం కొంత మార్పునకు దోహదం చేయవచ్చు.

"ప్రజల చుట్టూ రాజకీయాన్ని తిప్పుతూ ప్రజల్ని ప్రభువులుగా నిలపటానికి పార్టీలు వేదికలుగా, ఉపకరణాలుగా ఉండాలి. అందుకోసం కొన్ని సిద్ధాంతాలను పార్టీలు రూపొందించి ప్రజల మధ్యకు వెళ్తుంటాయి. కానీ ఈరోజు దాదాపు అన్నిపార్టీలూ సిద్ధాంతాలకు పూర్తిగా తిలోదకాలిచ్చాయి. ఎన్నికలపోరాటం ఫ్యాక్షన్ పోరాటాల్ని తలపిస్తోంది. ఎన్నికలంటే కొందరు వ్యక్తుల మధ్య పోరుగా మారిపోయింది. దీనికి అడ్డుకట్ట వేయటం అవసరం. మున్సిపల్ స్థాయి ఎన్నికల్లో సిద్ధాంతాల కన్నా స్థానిక సమస్యల మీదే ఎక్కువ దృష్టి ఉంటుందికాబట్టి, అక్కడ పార్టీల రహితంగా ఎన్నికలను నిర్వహించటానికి పెద్దగా అభ్యంతరం చెప్పాల్సిన అవసరం కన్పించటం లేదు" అని పార్టీ అధ్యక్షుడు జేపీ అన్నారు. ప్రత్యక్ష ఎన్నికలు, అధికార వికేంద్రీకరణ ఉంటేనే పూర్తి ఫలితాలు సాధ్యమని, కేవలం పార్టీల రహితంగా ఎన్నికలు పెట్టటం వల్ల ఫలితం ఉండదని మున్సిపల్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్‌లను, వార్డు ప్రభుత్వాల'ను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

## భవనం కూలిన ఘటనాస్థలాన్ని సందర్శించిన జేపీ



నారాయణగూడలో భవనం కుప్పకూలిన వార్త విన్న వెంటనే లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఘటనాస్థలాన్ని సందర్శించారు. అయితే అప్పటికే పెరిగిన రద్దీ వల్ల సహాయచర్యలకు ఆటంకం కలుగుతుందన్న ఉద్దేశంతో జేపీ... కూలిన భవనం ప్రాంతంలోకి వెళ్లకుండా దూరం నుంచే పరిశీలించి, ఫ్లైఓవర్ దిగువనే ఉన్న ఒక బాధిత కుటుంబంతో మాట్లాడి ఓదార్చి వెనుదిరిగారు.

అంతకుముందే అక్కడికి చేరుకున్న పార్టీ యువజన విభాగం యువసత్తా కార్యకర్తలు కొన్ని శిథిలాల తొలగింపులో సహకరించటంతోపాటు అక్కడ రాకపోకలకు అవాంతరం లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు. పూర్తిస్థాయిలో సహాయక బృందాలు వచ్చేంతవరకూ యువసత్తా నేతలు దాసరి రత్నం, నవీన్‌శర్మ, రామలింగారెడ్డి, మంగళ, శివాజీ తదితరులు తమ తోడ్పాటును అందించారు.

# శాస్త్రీయ ఆలోచనా విధానమే నాయకత్వానికి మొదటి సంపద



గన్‌రెడ్డి రాజారెడ్డి

**నాయకత్వ స్థానంలో ఉన్న వ్యక్తి యొక్క ఆలోచనలు, భావాలు, నమ్మకాలు ఆ వ్యక్తి పైనే కాకుండా వారి నాయకత్వంలో పనిచేసే వారందరిపై పడుతుంది. వారు రాజకీయ నాయకత్వంలో ఉన్నట్లయితే సమాజం పై ప్రభావం ఉంటుంది.**

ఒక వ్యక్తి ఆలోచనలు, భావాలు, నమ్మకాల యొక్క ప్రభావం ఆ వ్యక్తిపై మాత్రమే ఉంటుంది. కొంతవరకు ఆ వ్యక్తి కుటుంబం ప్రభావితమవుతుంది. కాని నాయకత్వ స్థానంలో ఉన్న వ్యక్తి యొక్క ఆలోచనలు, భావాలు, నమ్మకాలు ప్రభావం వారి నాయకత్వంలో పనిచేసే వారందరిపై పడుతుంది. వారు రాజకీయ నాయకత్వంలో ఉన్నట్లయితే సమాజంపై ప్రభావం ఉంటుంది. అమెరికన్ సైకాలాజికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేసిన అల్బర్ట్‌ఎలిస్ చెప్పినట్లుగా మనిషియొక్క సత్యగ్రహణ (Cognition) భావోద్వేగాలు, ప్రవర్తన అనేవి వేరు వేరు విషయాలు కావు, ఇవన్నీ కూడా ఒక దానితో ఇంకొకటి అనుసంధానమై ఉంటాయి. పై మూడింటిలో ఏ ఒక్క విషయంలో నైనా మార్పువస్తే మిగతా అన్నీ కూడా మార్పుకు లోనయ్యే అవకాశాలుంటాయి. ముఖ్యంగా సత్యగ్రహణ శక్తి, దీనినే సాధారణ భాషలో చెప్పాలంటే విషయాన్ని తెలుసుకొనే శక్తిగా పరిగణించవచ్చు. విషయాన్ని తెలుసుకొనే విధానము వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది వంటిది. ఉదా:- సంవత్సరం వయసు గల పిల్లవాని దగ్గరకు పాము వస్తే ఆ పిల్లవాడు దానిని పట్టుకునే ప్రయత్నం చేయవచ్చు. ఎందుకంటే వచ్చింది పాము అనిగాని, దాని మూలంగా ప్రాణాపాయం ఉందనే విషయం పైనగాని ఆ పిల్లవానికి విషయపరిజ్ఞానం లేదు కాబట్టి. ఈ సందర్భంలో పొడవుగా ఉండేది పాము అని మనం సమాచారాన్ని అందించినట్లయితే ఆ పిల్లవాడు తాడును చూసి పాము అనుకునే అవకాశం కూడా ఉంటుంది. ఈ సందర్భంలో తాడుకు, పాముకు తేడాను కూడా వివరించాలి. కాబట్టి విషయపరిజ్ఞానాన్ని గ్రహించే విధానమే అతి ముఖ్యమైన విషయం.

ఈ రోజు సమాచార విప్లవం మూలంగా ఎంతో సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఒక విధంగా చెప్పాలంటే అవసరాన్ని మించిన సమాచారం అందుబాటులోకి వచ్చింది. ఈ రోజు సమాచార సాధనాలు ప్రపంచంలో ఏ మూల ఏది జరిగినా క్షణాల్లో అందుబాటులోకి తెస్తున్నాయి. సాధారణంగా మనం సమాచారాన్ని చూస్తున్నప్పుడో లేదా చదువుతున్నప్పుడో మనలో ఉన్న ఉద్వేగాలకు గాని, మనలో ఉన్న భావాలకు గాని అనుకూలంగా అన్వయించుకుంటాము. లేదా అంతకుముందు మనలో నిక్షిప్తమై ఉన్న సమాచారంతో క్రోడీకరిస్తాము.

ఉదా:- ఒక ఎలక్ట్రికల్ కేబుల్‌ను ముట్టుకుంటే షాక్ కొడుతుందనే పరిజ్ఞానం మనలో ఉంటే ఏదైనా కేబుల్‌ను చూడగానే దాని నుండి దూరంగా జరుగుతాము. ఆ పరిజ్ఞానం లేకపోతే దానిని ముట్టుకుంటాము. కాబట్టి మనలో ఉండే భావాలు గాని, మనలో ఉండే పూర్వవిషయ పరిజ్ఞానం గాని సరియైనదైతే, శాస్త్రీయమైనదయితే మన సమాచార విశ్లేషణ కూడా అర్థవంతంగా ఉంటుంది. తద్వారా మన ప్రవర్తన కూడా అర్థవంతంగా ఉంటుంది. ఇదే క్రమంలో నాయకత్వ స్థానంలో ఉన్నవారికి వ్యవస్థపై పరిపాలనా విధానంపై ప్రజాసమస్యలపై విషయ పరిజ్ఞానము శాస్త్రీయమైనదైతే వారి ప్రవర్తనగాని, సమాచార విశ్లేషణ గాని సమాజానికి ఉపయోగపడేదిగా ఉంటుంది. అలా కాకుండా వారిలో సంకుచిత భావాలతో కూడిన ఆలోచనా విధానం ఉన్నట్లయితే వారి నిర్ణయాలు నిరుపయోగంగా మారే అవకాశం ఉంది.

ఈ రోజు సమాజంలో అభద్రత భావము ఎక్కువవుతున్నది. దీనిమూలంగా కులాలు, మతాలు, ప్రాంతము ఇంకా రకరకాలుగా మనిషిలో ఉన్న అభద్రత వ్యక్తమవుతున్నది. ఇలాంటి సందర్భంలో సమాజంలో ఏ చిన్న సంఘటన జరిగినా వివిధ వర్గాల ప్రజలు వారికనుగుణంగా విశ్లేషించుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో ఇది సమాజంలో అలజడి, అశాంతిని సృష్టిస్తున్నది. వీటన్నింటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే నాయకత్వ స్థానంలో ఉన్నవారు వీటన్నింటికి అతీతంగా ఆలోచిస్తూ ప్రతివిషయాన్ని, ప్రతి సమాచారాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించాలి. ఒకవేళ దానికి సంబంధించిన పూర్వ సమాచారం మన దగ్గర లేనట్లయితే ఆ పూర్తి సమాచారాన్ని వివిధ రకాల అధికారిక వ్యవస్థల ద్వారా పొంది ఆ సమాచారాన్ని విశ్లేషించినట్లయితే ఆ నాయకుడు సరియైన నిర్ణయాలు తీసుకోగలుగుతాడు. తద్వారా సమాజాన్ని సరియైన రీతిలో నడపగలుగుతాడు. ■

**(రచయిత హ్యూమన్ బిహేవియర్ రిసర్చ్ ఫౌండేషన్‌కు పరిశోధకులుగా పనిచేస్తున్నారు)**

# పౌరుడు కేంద్రంగా పాలన




అవినీతిని అరికట్టాలనే ఆర్తి సామాన్య పౌరులందరికీ వుందని, భవిష్యత్తు తరాలకు ఈనాటి హీన పరిస్థితులతో కూడిన సమాజాన్ని అందించడం నేరం అనే భావన వున్నవారు, సామాజిక స్పృహ కలిగిన వారు ఎంతో ఆవేదన చెందుతున్నారని తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ సి. హెచ్. వేణుగోపాలకృష్ణ అన్నారు. లోక్‌సత్తా పార్టీ కాకినాడ నగరశాఖ " పన్నులకు తగ్గ సేవలకోసం – అవినీతి లేని పాలన కోసం – పౌరుడు కేంద్రంగా మున్సిపాలిటీలలో పాలన" అనే అంశంపై స్థానిక రోటరీ సమావేశపు హాలులో నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యలన్నిటినీ తమ పదవీకాలంలో తీర్చలేకపోయినా వాటిని తీర్చడానికి నిజాయితీగా సంపూర్ణమైన కృషిని చేసిన ప్రజాప్రతినిధుల్ని ప్రజలు ఆదరిస్తారని శ్రీ వేణుగోపాలకృష్ణ అన్నారు.

చర్చాగోష్ఠికి లోక్‌సత్తా పార్టీ కాకినాడ నగర ఇన్‌ఛార్జి డా॥ ఆలూరి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ప్రజలు చైతన్యవంతులై తమ సమస్యలకు నిబద్ధతతో, నిజాయితీతో స్పందించే ప్రజాప్రతినిధుల్ని ఎన్నుకుంటేనే ప్రజలు మెరుగైన సేవల్ని పొందగలరని అన్నారు.

ప్రజలకు తమకు సమర్ధమైన సేవలు అందడమే ప్రధానమని, అధికార వికేంద్రీకరణ చేసి వార్డు కమిటీలకు సాధికారతను కల్పించాలని, మున్సిపల్ సమస్యల మీద ఆసక్తి వున్న వారికి తగిన అవగాహన కల్పించేందుకు శిక్షణనిచ్చి వారిని రాబోయే మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసేందుకు సమాయత్తం చెయ్యాలని, పౌరులు తమ సమస్యల పరిష్కారానికి ఎజెండా రూపొందించాలని లోక్‌సత్తా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ డి.వి.వి.ఎస్. వర్మ పిలుపిచ్చారు.

నిధులు, విధులు స్థానిక ప్రభుత్వాలకు అప్పగించి, ఒక నియంత్రణ వ్యవస్థ ద్వారా సక్రమంగా అమలయ్యేలా చూడడం ద్వారా మాత్రమే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షులు శ్రీ వై.డి.రామారావు అన్నారు. వార్డుస్థాయిలో ప్రజామేనిఫెస్టోని రూపొందించాలని, మంచి ప్రజాప్రతినిధులు కౌన్సిల్‌లోకి రావాలంటే ముందుగా నాయకత్వ శిక్షణ ద్వారా అవగాహన కలిగించడం, నిబద్ధతతో క్రమశిక్షణతో మెలిగేలా మలచడం అవసరమని రాష్ట్ర నాయకుడు కార్తీక్‌చంద్ర అన్నారు. ప్రజలను జాగృతం చెయ్యడమే ప్రధాన కార్యక్రమం కావాలని, ప్రస్తుతం వున్న పరిస్థితిని మార్చడం సాధ్యం కాదనే నిస్పృహ మంచిది కాదని, మంచిమార్పు కోసం పట్టుదలతో కృషి చెయ్యాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీ జ్యోతుల సీతారామమూర్తి అన్నారు.

కార్పొరేటర్ శ్రీ గోళ్ళమూడి నాగేశ్వరరావు కాకినాడ కార్పొరేషన్‌కి సంబంధించి పలు సమస్యల్ని, వాస్తవపరిస్థితుల్ని ప్రస్తావించి మేధావులు స్పందించినపుడు, ప్రశ్నించినపుడు మాత్రమే మున్సిపల్ పాలనలో కొంతమార్పు సాధ్యమని అన్నారు. నగర సమస్యల పరిష్కారానికి షాడో మున్సిపల్ కౌన్సిల్‌ని ఏర్పాటు చేసుకుని పోరాడవలసిన అవసరం వుందని డా॥ పి. చిరంజీవి మొదలైన వారు అన్నారు. తొలుత చర్చాగోష్ఠికి కాకినాడనగరశాఖ అధ్యక్షులు నెక్కంటి శ్రీనివాస్ స్వాగతం పలకగా, కార్యదర్శి ఎమ్. శివరామకృష్ణ వందన సమర్పణ చేసారు. చర్చించిన అంశంపై పెట్టిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతుల్ని అందించడం జరిగింది. ■

# మద్యనిషేధం పాటిద్దాం – ప్రాణాలను రక్షిద్దాం




మద్యం ఆదాయంతో నా దేశంలోని బిడ్డలకు విద్యను అందించవలసి వస్తే అసలు ఆ విద్యే వద్దు అని గాంధీ మహాత్ముడు అన్నారని, కాని ఈనాటి ప్రభుత్వాలు మాత్రం సారా అమ్మకాల మీద వచ్చే ఆదాయంపైనే ఆధారపడుతూ ప్రజలు ఇంకా సారా మత్తులో కూరుకుపోయేందుకు విచ్చలవిడిగా అమ్మకాల్ని ప్రోత్సహిస్తూ ఆదాయాన్ని పెంచుకుంటున్నాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా॥ ఆలూరి విజయలక్ష్మి అన్నారు. బండారులంక, అంబాజీ పేట సమీప గ్రామాల్లో కల్తీ సారా తాగి 17మంది మరణించడం, అనేకమంది దృష్టిని కోల్పోవడం, కొన్ని వందలమంది ఆసుపత్రి పాలయిన నేపథ్యంలో కోనసీమ లోక్‌సత్తా పార్టీ నాయకులు శ్రీ ఉప్పుగంటి భాస్కరరావు, శ్రీ వీరంశెట్టి నాయకత్వంలో నిర్వహించిన నిరసన ర్యాలీని ప్రారంభిస్తూ, బండారులంకలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆమె ప్రసంగించారు. ప్రజల ఆరోగ్యం, క్షేమానికి భంగకరంగా వున్న వాటిని నిషేధించి, నియంత్రించవలసిన ప్రభుత్వమే ఈ దుర్ఘటనకు బాధ్యత వహించాలని ఆరోపిస్తూ బాధిత కుటుంబాలకు తగిన మొత్తంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డా॥ విజయలక్ష్మి డిమాండ్ చేసారు. లోక్‌సత్తా పార్టీ కాకినాడ శాఖ నాయకులు నెక్కంటి శ్రీనివాస్, వాకాడ సుబ్బారావు, శివరామ కృష్ణ రాజమండ్రి రీజియన్ ఇన్‌ఛార్జి శ్రీమతి చంద్రకళ, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకులు డా॥ఇ.ఆర్.సుబ్రహ్మణ్యం, లక్ష్మీగణపతి సేవా సంఘం, శ్రీనివాస పాలమిత్ర సంఘం, భారతీయ కిసాన్ సంఘం – కోనసీమ శాఖ, జన విజ్ఞాన వేదిక– అమలాపురం శాఖ సభ్యులు, స్థానిక లోక్‌సత్తా పార్టీ సభ్యులు, బండారులంక పరిసరాల గ్రామాల పౌరులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ బండారులంక నుండి, సుమారు 4 కి.మీ.దూరంలో వున్న సారా మృతుల గ్రామం గంగనకుర్రు అగ్రహారం వరకు జరిగింది. ■

# నాయకత్వం
# నాయకత్వ లక్షణాలు



**డా॥ పి. భాస్కరరావు**
బి.వి.ఎస్‌సి

***లోక్‌సత్తా పార్టీ ఒక జాతీయ పార్టీ, జాతి సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారాలు గల జాతీయప్రభుత్వం మరియు అధికార వికేంద్రీకరణ ద్వారా జిల్లా ప్రభుత్వాలతో కూడిన బలమైన రాష్ట్రాల ఏర్పాటే లోక్‌సత్తా లక్ష్యం. కుల, మత, భాషా, ప్రాంతాలకు, అతీతమైన పార్టీ. ఇది అందరి ప్రయోజనాలను మేళవించే జనస్రవంతి పార్టీ. దీనికి బలమైన, స్థిరమైన మౌలిక లక్ష్యాలు ఉన్నాయి.***

దేశంలో, రాష్ట్రంలో సంప్రదాయ పార్టీల రంగు,రుచి, రూపం, చూస్తున్నాం. కుటుంబ పార్టీలుగా, ప్రైవేటు ఎస్టేట్లుగా మారుతున్నాయి. అక్కడ, నేతలే ప్రభువులు, సభ్యులు – కార్యకర్తలు బోయీలు. స్వప్రయోజనమే వారి లక్ష్యం.

లోక్‌సత్తా పార్టీ, కొత్త తరహా పార్టీ దాని దారి వేరు, తీరు వేరు. నూతన రాజకీయ సంస్కృతి దీని పునాది. కొత్త తరానికి కొత్త రాజకీయం దీని లక్ష్యం. కాగితాలలో రాసుకుంటే ప్రజాస్వామ్యం రాదు, మనమే ఆచరించాలి, ఆహ్వానించాలి, ప్రోత్సహించాలి. అది మనలో జీర్ణం కావాలి, మన సంప్రదాయం కావాలి.

లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు, నాయకులు పై లక్ష్యాలను సాధించడం కోసం, నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలి.

లోక్‌సత్తా పార్టీకి, భిన్నమైన నాయకత్వం, కార్యకర్తలు ఉండాలి. ఈ రోజు మనం ఒక్కొక్క పార్టీకి ఒక్కొక్క ప్రత్యేకమైన రాజకీయ నాయకత్వాలు చూస్తున్నాం. వాళ్ళ వస్త్ర ధారణ, మాట్లాడే భాష, ప్రవర్తన, హావభావాలు, వాళ్ళు చెప్పకుండానే వారు ఏ పార్టీకి చెందిన వారో తెలిసి పోతుంది. రాజకీయ పార్టీల నాయకులు – కార్యకర్తల ప్రవర్తన, వస్త్రధారణ, భాష, చూస్తూనే ప్రజలకు, ఆ నాయకులు – కార్యకర్తలపై ఒక ప్రత్యేకమైన అభిప్రాయం ఏర్పడుతుంది. వారి వలన ప్రజలలో ఆ పార్టీపై గౌరవం / అగౌరవం కలుగుతాయి.

లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు, నాయకులు భిన్నమైన నాయకత్వ లక్షణాలతో ప్రజలలో గౌరవం, మన్నన పొంది మంచి నాయకత్వ లక్షణాలతో, ప్రజలలో మమేకమై ప్రజల ఆదరణ పొంది, పార్టీని ప్రజలు ఆదరించే విధంగా ఆకట్టుకోవాలి.

లోక్‌సత్తా నాయకులు – కార్యకర్తలు రాజకీయంగా ప్రజల మన్నన పొందాలంటే ఈ క్రింది నాయకత్వ లక్షణాలు అవసరం.

**1. రాజకీయ లక్ష్యాన్ని ఏర్పర్చుకోవడం, 2. పట్టుదల, క్రమశిక్షణ కలిగి ఉండటం, 3. సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం, 4. పోటీ తత్వం కలిగి ఉండటం, 5. భవిష్యత్తు ప్రణాళికలు కలిగి ఉండటం, 6. ఇతరులతో కలిసి పని చేయడం, 7. బాధ్యతలను అంగీకరించడం, 8. ఎల్లప్పుడూ సానుకూల ధృక్పదం కలిగి ఉండటం, 9. ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవడం**

పై నాయకత్వ లక్షణాలకు అదనంగా ఈ క్రింద సూచించిన అంశాలు కూడా ముఖ్యం.

**వస్త్రధారణ - భాషాప్రయోగం**

కార్యకర్త – నాయకుని యొక్క వ్యక్తిత్వాన్ని తెలిపేది, ఆకర్షించేది, ఆ వ్యక్తి వస్త్రధారణ, అతడు ఉపయోగించే భాష ప్రజలను అకర్షించాలంటే చక్కటి మాట తీరు, స్పష్టమైన చలాకితనం ఉండాలి. అస్పష్టంగా పదాలు సాగదీస్తూ, నీరసంగా మాట్లాడే వారు ప్రజలను ఆకట్టుకోలేరు.

**సంభాషణ**

నాయకులు – కార్యకర్తలు హుందాగా, గౌరవంగా, స్పష్టంగా, మనం చెప్పదలిచిన విషయాన్ని వినసొంపుగా, ఇంకా వినాలి అన్న విధంగా, పదప్రయోగం, వివరించే నేర్పు, పదాల ఉచ్ఛారణ, స్వరస్థాయి ఉంటే ప్రజలు మనం చెప్పే విషయాన్ని చక్కగా అర్థం చేసుకొని ఆ నాయకుని – కార్యకర్త పట్ల ఆకర్షితులు అవుతారు.

**3. కమ్యూనికేషన్ స్కిల్స్**

కార్యకర్త – నాయకులు చెప్పే అంశం, ప్రజలకు చక్కగా అర్థం అయ్యే విధంగా చెప్పటం అన్నది అతి ముఖ్యమైన విషయం. నాయకునికి – కార్యకర్తకి, పార్టీకి సంబంధించిన భావజాలం, విషయ పరిజ్ఞానం ఎంత ఉన్నప్పటికి, దానిని ఎంత బాగా ప్రజలకు అర్థం అయ్యేవిధంగా చెప్పగలిగామో అనేది ముఖ్యం. నాయకులు – కార్యకర్తలు తాము చెప్పదల్చిన అంశం సూటిగా అర్థం అయ్యేలాగా, చెప్పదల్చుకున్న వ్యక్తులకు, గ్రూపులకు, ప్రజలకు చేరేలాగా సరైన మోతాదులో, మాటల శబ్దం ప్రయోగించాలి. అది వినిపించి, వినిపించకుండా, కాకుండా లేదా గట్టిగా అరచి ప్రజలు అదిరిపడేలా కాకుండా సమానస్థాయిలో చెప్పటం ముఖ్యం. అలాగే మరీ వేగంగా లేదా మరీ నెమ్మదిగా మాట్లాడకూడదు. సంభాషణలో పద ప్రయోగానికి తగినంత మోతాదులో వేగాన్ని జోడించి, చెప్పదల్చుకున్న ప్రతిమాట ఒకే వేగం, ఒకే శబ్దస్థాయి ఉండి అర్థం అయ్యే పద్ధతిలో చెప్పటంలోనే ఆ కార్యకర్త – నాయకుని స్థాయిలతో పాటు పార్టీ విజయం ఆధారపడి ఉంటుంది.

కార్యకర్తలను/ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిచేటప్పుడు నిటారుగా నిలబడి ఉత్సాహంగా నవ్వుతూ, ప్రజల వైపు చూస్తూ ప్రసంగించాలి. భయపడుతూ, తడబడుతూ, ఆకాశంలోకి/ నేలవైపు చూస్తూ ప్రసంగించకూడదు. చెబుతున్న అంశానికి అనుగుణంగా ముఖ కవళికలు, చేతులు శరీర కదలికలు వుండాలి. ■

# మద్యం...
# సంక్షేమానికి గొడ్డలిపెట్టు



**బట్టు కోటేశ్వర రావు**

***" ఏటా లక్షా 30 వేల పై చిలుకు నమోదవుతున్న రహదారి ప్రమాద మరణాల్లో 40 శాతానికి మద్య సేవనమే కారణం"***

**మ**హాత్ముడు కోరింది గ్రామ స్వరాజ్యం. ఏలికలు ఎంతో నిష్ఠగా సంస్థాపించింది గ్రామ "సారా"జ్యం! పచ్చని కోనసీమ గుండెలపై అక్రమ సారా కుంపట్లు ఇటీవలే వందల కుటుంబాల్లో శోకాగ్నులు రగిలించాయి. ఈ ఘటన ఊడలు దించుకున్న మద్యం మాఫియా దురాగతాల్నే కాదు. ప్రజారోగ్యాన్ని ఖర్చు చేస్తున్న సర్కారి ఎక్సైజ్ విధానాల్లోని లొసుగుల్ని ఎండగడుతోంది. జిల్లాలో ఎన్నివేల మంది నాటుసారా తయారీదారులున్నారో వారి ప్రాపకంలో ఎన్ని బట్టీలు నడుస్తున్నాయో సర్కారీ సిబ్బందికి తెలుసు. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో పకడ్బందీగా సాగుతున్న సారా వ్యాపారంపై చూపు సారిస్తే ఎమౌతుందో తెలుసు కాబట్టి "మాములు" గానే అవైపు వెళ్లరు. ఛీప్ లిక్కరు పేరిట సర్కారీ లేబుల్‌తో దొరికే సరుకు పోను పోను ఖరీదైపోతుండటంతో అభాగ్య జీవులకు నాటుసారా బట్టిలే దిక్కుగా కనిపిస్తున్నాయి. వచ్చిన వాళ్ళకి కిక్కు మరింతగా ఎక్కించందే బేరాలు రావన్న వ్యాపారుల వైఖరి – నాటు సారాను విషతుల్యం చేస్తోంది. అమోనియ, మిథైల్ ఆల్కహాల్, డైజోఫాం మాత్రలు, నల్లబెల్లం లాంటివి కలిపిన నాటుసారా దేశవ్యాప్తంగా ఏటా వేల మంది ప్రాణాలు బలిగొంటోంది. దారుణ దుర్ఘటనలు జరిగినపుడు దిగ్భ్రాంతి చెందడం, దోషులంటూ కొందరిని నిర్బంధించడం తప్ప, అక్రమ సారా విష పరిష్వంగం నుండి గ్రామాల్ని విముక్తి చేయడానికి పేరు గొప్ప ప్రభుత్వాలు చేస్తున్నదేముంది?

మత్తు పానీయాల వ్యాపారం చెయ్యడం "పౌరుల హక్కు" కాదు, వాటిని సేవించే హక్కు పౌరులకి లేదు అని పదహారేళ్ళ క్రితం రాష్ట్ర హై కోర్టు సంపూర్ణ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 'మాఫియాను అడ్డుకోవడం కోసం మాఫియా చేసే పనుల్ని ప్రభుత్వాలు చేయవచ్చా అని!' రాష్ట్ర ఉన్నత న్యాయస్థానమే అయిదేళ్ళనాడు ఎక్సైజ్ పాలసీని సూటిగా తప్పుబట్టింది. ప్రజా ప్రయోజనాలు మంట కలుస్తాయంటూ లిక్కర్ వ్యాపారాన్ని గుత్త హక్కుగా మార్చుకొని "మద్యే" మార్గంలో ప్రభుత్వాలు నడుస్తున్నాయి. కల్తీ విషం కాటునుండి బీదల్ని రక్షించడమే లక్ష్యమంటూ లిక్కర్ రాబడిలో మునిగి తేలుతున్న సర్కార్లు, ప్రైవేటు సారా బట్టీలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని ఉత్తర్వులు జారీ చెయ్యడమేమిటి? ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనపై రెండొందలు జరిమానాతో చెల్లు. అక్రమ సారా వ్యాపారానికి వర్తిస్తున్నది అదే రూలు! 2004 డిసెంబరులో జారి అయిన జి.ఓ. ఆక్రమ సారా రాక్షసులకు రక్షక కవచంగా మారింది. రాబడిని ఇంతలంతలుగా చేసుకోవడమే లక్ష్యంగా ఊరూరా "బెల్టు షాపులు" తెరిపించి మరీ చిప్ లిక్కరును ప్రభుత్వమే అందుబాటులోకి తెచ్చింది. ఆ విధంగా మందభాగ్యులకు "మందుభాగ్యం" కల్పించి వాళ్లను వ్యసనపరులుగా మార్చిన ప్రభుత్వమే లిక్కర్ రేట్లకు రెక్కలు తొడగడంతో వాళ్ల దృష్టి తక్కువ ధరకు దొరికే నాటు సారా వైపు మళ్లుతోంది. అధికారుల రాజకీయ నాయకుల రక్షణఛత్రంలో జడలు విరబోసుకున్న మాఫియా కల్తీసరుకులతో ఇలా అభాగ్యుల ప్రాణాలు కబళిస్తోంది. కోట్లాది మందుబాబుల గొంతుల్లో గరాటాలు పెట్టి మరీ గరళం గుమ్మరించి వాళ్ళ రక్తాన్ని రూపాయలుగా మార్చి సంక్షేమ రాజ్యం తెస్తామంటున్న ప్రభుత్వాల ధోరణి – పచ్చని పల్లెలో చితిమంటలు ఎగదోస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా 1983 నుండి మత్తు పానీయం వినిమయం తగ్గుతున్నా, వర్ధమాన దేశాల్లో ఆ దురలవాటు పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం స్పష్టీకరించింది. "ఆరోగ్యానికి హానికరమైన మత్తు పానీయాలు, మందుల వినిమయం క్రమంగా తగ్గుతూ పోయి నిషేధం లాంటి పరిస్థితి వచ్చేలా చూడటం ప్రభుత్వాల విధి'' అని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఘోషిస్తున్నాయి. 'యువతరం మత్తు పానీయాలకు బానిస అవుతోందంటూ రోగగ్రస్త జాతిని కాదు మనం కోరుకునేది' అని సుప్రీంకోర్టు 2006 మే నెల లోనే ప్రభుత్వాలకు ''బాధ్యత'' గుర్తుచేసినా ఏం జరిగింది? దేశంలో "ఆత్మహత్యలు" "విడాకులు" "గృహహింస పెరగడానికి" మత్తు పానీయాలే కారణం. ఏటా లక్షా 30 వేల పై చిలుకు నమోదవుతున్న రహదారి ప్రమాద మరణాల్లో 40 శాతానికి మద్య సేవనమే కారణం" అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మద్య మహమ్మారి మరెంతగా సామాజిక జీవన విచ్ఛిన్నం సాగిస్తున్నదో మనసుపెట్టి చూస్తే తెలుస్తుంది. కల్తీల బారిన పడి మృత్యువాత పడుతున్న వారికి ఎన్నో వందలరెట్లు జీవచ్ఛవాలుగా మిగిలి పోతున్నారు. ఇళ్ళూ, ఒళ్లూ గుల్ల కాగా లక్షల కుటుంబాలు విధిలేక వీధిన పడుతున్నాయి. సారాక్షసి కరకు పాదాల కింద సామన్యుడి బతుకును నుగ్గునూగు చేసేదేనా సంక్షేమ రాజ్యం?

మహళాభ్యున్నతికి కట్టుబాటు చాటుతూనే, మద్య రక్కసికి వాళ్ల సౌభాగ్యాన్ని బలిపెడుతున్న పాలకుల ధోరణి ఎప్పటికైనా మారుతుందా? ■

**విధి నిర్వహణను మించిన దేశసేవ లేదు - గాంధీ**

# జీవో 57ను ఉపసంహరించుకోవాలి
# వార్డు కమిటీలను ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోవాలి

## లోక్‌సత్తా

మన దేశంలో స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధత కల్పించి పదహారు సంవత్సరాలు దాటింది. అయినప్పటికీ అవి ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయే గాని, నిజమైన స్వపరి పాలనాధికారాలను, బాధ్యతలను వాటికి బదిలీ చేయలేదు.

1993 దాకా ఈ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధతే లేదు. రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద స్థానిక ప్రభుత్వాల ఉనికి ఆధారపడి ఉండేది. రాజ్యాంగబద్ధత వచ్చిన తరువాత కూడా రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాలకు పాలనలో తగిన పాత్ర ఇవ్వడాన్ని వ్యతిరేకించాయి. బ్రిటిష్‌కాలంలో స్వపరిపాలన స్థానిక ప్రభుత్వాలతో ప్రారంభమై క్రమక్రమంగా పెద్ద అంచెలకు విస్తరించగా, స్వతంత్ర భారతంలో స్వపరిపాలన జాతీయస్థాయిలో ప్రారంభమై రాష్ట్రాలతో ఆగిపోయింది. ఇలా ప్రజాస్వామ్యం తల్లకిందులైంది. అందుకే గత ఆరు దశాబ్దాలలో ఎన్నో అపశ్రుతులను చూశాం. ఎంతో అవినీతిని భరించాం. అంతులేని అహంకారాన్ని చవిచూశాం. నిరంతర దుష్పరిపాలనను ఎదుర్కొన్నాం. చాలా ఆలస్యంగా కొందరికయినా జ్ఞానోదయమయింది. స్థానిక ప్రభుత్వాలు బలోపేతం కాకుండా మంచి ఫలితాలు సాధ్యంకాదని గుర్తించటంతో 73, 74వ రాజ్యంగ సవరణలు చేశారు. అయితే అలవాటు ప్రకారం స్థానిక ప్రభుత్వాల నిర్మాణాన్ని గూర్చి అత్యంత సూక్ష్మమైన వివరాలను కూడా రాజ్యాంగబద్ధం చేసి, స్థానిక పరిస్థితుల మేరకు మార్పులు చేసుకునే అవకాశం లేకుండా ఉక్కు చట్రంలో బిగించారు. స్థానిక ప్రభుత్వాల అధికారాలు, బాధ్యతల విషయంలో నిరాసక్తత ప్రదర్శించారు. ఇలా ప్రజాస్వామ్యం తల్లకిందులు కావటంతో యూనియన్ నుంచి కనీస అధికారాలు రాష్ట్రాలకు రావటానికి, పై రెండంచెల మధ్య కొంత సమతూకం పాటించటానికి 40 ఏళ్ళు పట్టాయి. మనం మిన్నకుంటే రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు మధ్య స్పష్టమయిన అధికారాల విభజన జరగటానికి, అధికార వికేంద్రీకరణకు మరికొన్ని దశాబ్దాలు పట్టే ప్రమాదం ఉంది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాలివ్వటం రాష్ట్రప్రభుత్వం సొంత విషయం కాదు. నిజానికి రాష్ట్ర ప్రభుత్వం కన్నా స్థానిక ప్రభుత్వం ముందు పుట్టింది. అయితే స్థానిక ప్రభుత్వాల పోరాటం కేవలం స్థానికంగా ఎన్నికయిన కొందరి అధికార దుర్వినియోగానికి, వారి ఎన్నికల పెట్టబడిని తిరిగి రాబట్టటానికి జరిగే తంతు కారాదు. అది మంచి పాలనకు ప్రజల పోరాటం కావాలి. స్థానికంగా ఎన్నికయిన ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కేవలం స్థానిక సంస్థలుగా కాక, స్థానిక ప్రభుత్వాలుగా మనం గుర్తించాలి. అధికార వికేంద్రీకరణే మంచి పాలనకు మార్గం మరో పాతికేళ్లు వృథా కాకుండా స్థానిక ప్రభుత్వాలను వెంటనే బలోపేతం చేయటం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమయింది.

### స్థానిక సంస్థల ప్రాధాన్యత – మొదటి ఎన్నికలు స్థానికంగానే !

1892 లోనే స్థానిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. లార్డ్ రిప్పన్ వైస్రాయ్‌గా ఉన్న కాలంలో వాటికి అంకురార్పణ జరిగింది. స్థానికంగా స్వపరిపాలన సంస్థల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలన్న సంకల్పంతో బ్రిటిష్ వలస పాలకులు వాటిని ఏర్పరిచారు. దేశంలో స్వపరిపాలనకు పునాదిగా ఈ స్థానిక సంస్థలు ఉంటాయని ఆనాడు భావించారు. దానికి అనుగుణంగానే ఎందరో మేటి నాయకులు స్థానిక ప్రభుత్వాల నుంచి వచ్చారు. దేశభక్త చిత్తరంజన్ దాస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, విఠల్‌భాయ్ పటేల్, పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ, నేతాజీ సుభాస్ చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి మహామహులెందరో పురపాలక సంఘాలలో అనుభవం గడించి పరిపాలనలో నిష్ణాతులయ్యారు. రాష్ట్రస్థాయిలో స్వపరిపాలన రాకముందే ఆ విధంగా స్థానిక ప్రభుత్వాలలో స్వపరిపాలన వచ్చింది. ఆనాడే జిల్లా బోర్డులకు, పురపాలక సంఘాలకు నిర్దిష్టమయిన స్వయం నిర్ణయాధికారాలను, బాధ్యతలను పరాయి పాలకులు కట్టబెట్టారు. ఆ తరువాతే అంటే 1937లో జరిగిన ఎన్నికల ద్వారా రాష్ట్రాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు పాలనాధికారాలను ఇచ్చారు. ఆ విధంగా దేశంలో మొదట ప్రజలెన్నుకున్న స్థానిక ప్రభుత్వాలు పాలన బాధ్యతలను చేపట్టిన నాలుగు దశాబ్దాలకు రాష్ట్రస్థాయిలో స్వపరిపాలనకు అంకురార్పణ జరిగింది. అది జరిగాక 10 సంవత్సరాలకు దేశానికి స్వాతంత్ర్యం రావటంతో జాతీయస్థాయిలో ప్రజాప్రభుత్వం మొదటిసారిగా ఏర్పడింది. మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో ఏడో షెడ్యూలులో మూడు జాబితాలను చేర్చారు. అందులో యూనియన్ ప్రభుత్వం అధీనంలో ఉండే అంశాలను మొదటి జాబితాలోను రాష్ట్రాల చేతుల్లో ఉండే అంశాలను రెండవ జాబితాలోను, ఉమ్మడిగా వర్తించే అంశాలను మూడో జాబితా లోను పేర్కొన్నారు. అప్పటి నుంచి యూనియన్, రాష్ట్రాల మధ్య స్పష్టమయిన అధికారాల విభజన, వేర్వేరుగా ఎన్నుకున్న ప్రభుత్వాలు ఉంటూ వచ్చాయి. అయితే దేశంలో ప్రజల స్వపరిపాలనకు నాంది పలికిన స్థానిక ప్రభుత్వాల మాట మన నేతలకు గుర్తుకురాలేదు.

బ్రిటిష్‌వారి కాలంలో క్రమక్రమంగా చిన్నస్థాయి నుంచి పెద్దస్థాయి వరకు స్వపరిపాలనను విస్తరించే ప్రయత్నాలు జరిగాయి. స్వతంత్ర భారతంలో పరిస్థితి మొత్తం తారుమారయింది.

### అధికార వికేంద్రీకరణతోనే సత్పరిపాలన

ఇంత జరిగినా, ఈనాటికీ దేశంలో స్థానిక ప్రభుత్వాలకు విలువ లేదు. స్వతంత్రం పేరుతో ముందు యూనియన్‌కు, ఆ తరువాత రాష్ట్రాలకు అధికారాలు దాఖలయితే, స్థానిక ప్రభుత్వాలు మాత్రం నేటికీ ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. అసలు స్థానిక ప్రభుత్వాల ఉనికే రాష్ట్రాలకు దుర్భరంగా తయారయింది.

రాజ్యాంగంలోని 73,74 సవరణల ద్వారా ఎట్టకేలకు సిద్ధించిన స్థానిక సంస్థల అధికారాలు, ప్రభుత్వాధినేతల సవతి తల్లి ప్రేమతో నీరు కారిపోతున్నాయి. అందుకు తాజా ఉదాహరణ ఫిబ్రవరి 10న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.వో.నెంబర్ 57,58,59.

స్థానిక ప్రజలచే ఎన్నికై, అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు నిధులు, విధులు ఉండాలన్న భావనతోనే వార్డు కమిటీలను, ఏరియా సభలను ఏర్పాటుచేయాలని జాతీయ ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంటోంది. జేఎన్ఎన్‌యుఆర్ఎం (జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్) నిధులను పొందాలంటే వార్డు కమిటీలను, ఏరియాసభలను విధిగా ఏర్పాటుచేయాలనే నిబంధన ఉండటంతో కేవలం విధిలేకే మొక్కుబడిగా వాటి ఏర్పాటుకు రాష్ట్రసర్కారు జీవో జారీ చేసింది. ప్రజాస్వామ్యబద్ధ ఎన్నిక లేకపోవటం, అధికారాలు, నిధుల కేటాయింపు నామమాత్రంగా ఉండటం చూస్తే జాతీయ ప్రభుత్వ నిధుల పట్ల తప్ప, ప్రజలకు అధికారాల్ని బదలాయించటం పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం ఆసక్తిలేదని అర్థమవుతుంది. వార్డు కమిటీ అంటే వార్డు ప్రభుత్వంలా పనిచేయాలి. దేశంలో మొదటిసారిగా వార్డు మేనిఫెస్టోను రూపొందించి, వార్డు ప్రభుత్వం ప్రధాన ఎజెండాగా లోక్‌సత్తా పార్టీ ఇటీవలి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోరాడింది. మేనిఫెస్టోలో భాగంగా మున్సిపల్ నిధులకు తోడు తలసరి ప్రతి పౌరునికీ రూ.1000 అదనంగా హామీనిచ్చాము. సాధికారత లేని వార్డు కమిటీలు, ఏరియాసభల వల్ల చెప్పుకోవటానికి తప్ప ఒరిగేదేమీ ఉండదు.

"ప్రభుత్వం తలపెట్టిన వార్డు కమిటీల్లో అన్నివర్గాలకు అవకాశం, మహిళలకు కోటా ఉన్నప్పటికీ, వార్డు కమిటీలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైనవి కాకపోవటం వల్ల స్థానిక రాజకీయనేతల అవాంఛనీయ ప్రమేయం ఉండే అవకాశం ఉంది. అది మున్ముందు పెడధోరణులకు దారితీసే అవకాశముంది. దాంతోపాటు ఏరియాసభలకు నిర్దిష్ట సరిహద్దుల్ని చెప్పకుండా కేవలం ప్రతి 5000మంది జనాభాకు ఒక సభ ఉంటుందని మాత్రం చెప్పి వదిలేసింది. దాంతోపాటు... ఇప్పటికే అధికారాలను ఎన్నికైన మున్సిపల్ కౌన్సిల్‌కు, మేయర్‌కు ఇవ్వకుండా వారిని నామమాత్రంగా మార్చివేసిన ప్రభుత్వం అదే కేంద్రీకృత ధోరణిని వార్డు కమిటీలు, ఏరియాసభల విషయంలోనూ ప్రదర్శించింది. కేవలం స్థానిక అంశాల పర్యవేక్షణ, మున్సిపల్ కమిషనర్‌కు సూచనలు, సలహాలివ్వటం వరకే ఆ కమిటీలు పరిమితమవుతాయి. చట్టాలన్నీ సక్రమంగా అమలైతే అడపాదడపా చిన్నచిన్న పనులు జరుగుతాయని ఆశగా ఎదురుచూడటం మినహా దీనివల్ల ఫలితముండదు".
వార్డు పేరుతో ప్రభుత్వం చేస్తున్న వ్యయంలో 200వ వంతు కూడా కమిటీకి కేటాయించ లేదు

## ఇక స్థానిక పాలనకు అర్థమేంటి?

అలాగే మొత్తం బడ్జెట్‌లో మెయింటెనెన్స్ విభాగం కింద ఉన్న నిధుల్లో కేవలం 20శాతం మాత్రమే వార్డు కమిటీలన్నిటికీ కలిపి కేటాయించారు. ఈ నిధులు ఎంత స్వల్పమో గ్రేటర్ హైదరాబాద్ బడ్జెట్‌ను పరిశీలిస్తే అర్థమవుతుంది. ''2008-09లో జీహెచ్ఎంసీ బడ్జెట్ రూ.2920.86కోట్లు. అందులో 'ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్' కింద మొత్తం రూ.386.28కోట్లు. అందులో 20శాతమంటే రూ.77.2కోట్లు. ఈ మొత్తాన్నీ మహానగరమంతా పంచితే వార్డు రూ. 50లక్షలు కూడా రావు. ఒక్కో వార్డుకు 70,000 నుంచి లక్షా 70వేల వరకూ జనాభా ఉంటే ఆ మొత్తం ఏ మేరకు ఉపయోగపడుతుంది? లక్ష జనాభా ఉన్న వార్డు పేరుతో అధికారికంగా ఖర్చవుతున్న డబ్బు ఏటా రూ. 120కోట్లు కాగా, వార్డు కమిటీలకు మాత్రం ప్రభుత్వం రూ.50లక్షలు కేటాయించింది. ఆ నిధుల వ్యయం కూడా అధికారుల కనుసన్నల్లోనే జరగాల్సి ఉంది.

మాజీ ఐ.ఎ.ఎస్.ఆఫీసర్ శ్రీ.బి.పి.ఆర్.విఠల్ ఫైనాన్స్ కమిషన్ మాజీ మెంబర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన లోక్‌సత్తా కమిటీ 2004లో చేసిన ప్రతిపాదనలు :

1. ప్రతి వార్డుకి ఒక వార్డు కమిటీ వుండాలి. ఆ వార్డు ద్వారా ఎన్నికైన కౌన్సిలర్ / కార్పొరేటర్ ఆ కమిటీకి అధ్యక్షుడుగా వుండాలి. మహిళలు, బలహీనవర్గాలు మరియు సమాజంలోని విభిన్న తరగతుల వారికి సమమైన ప్రాతినిధ్యం వుండేలా పారదర్శకమైన ప్రక్రియ ద్వారా ఆ వార్డు ప్రజల నుండి ప్రతినిధులను వార్డు కమిటీ సభ్యులుగా ఎంపిక చేసుకోవాలి.
2. వీధిదీపాలు, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, మురుగునీరు, రోడ్ల నిర్వహణ, పాఠశాల భవన నిర్వహణ, స్థానిక ఆసుపత్రుల నిర్వహణ, స్థానిక మార్కెట్‌లు, పార్క్‌లు, ఆటస్థలాలు నిర్వహణ మొదలైన వార్డు స్థాయిలో సంభాళించవల్సిన విషయాలను నియంత్రణ చేసే పూర్తి అధికారాలు వార్డు కమిటీకి వుండాలి.
3. వార్డు కమిటీకి అప్పగించిన అన్ని విధులను నిర్వర్తించే ఉద్యోగులు వార్డు కమిటీ క్రిందే పనిచేస్తూ వార్డు కమిటీకి బాధ్యులుగా వుండాలి. అట్టి ఉద్యోగులందరికి తృప్తికరమయిన విధి నిర్వహణ తర్వాత వార్డు కమిటీనే జీతభత్యాలు ఇవ్వాలి.
4. వార్డు కమిటీకి అప్పజెప్పబడిన పనులకు సంబంధించిన నిధులు ఒకేసారి వార్డు కమిటీకి ఇచ్చేయాలి.
5. వార్డు కమిటీకి అప్పచెప్పబడిన పనులకి సంబంధించి వార్డు కమిటీ రూపొందించుకున్న బడ్జెట్‌ని పరిగణనలోకి తీసుకొని మున్సిపల్ బడ్జెట్ తయారుచేయాలి. వార్డు కమిటీ సమావేశాలను సాధ్యమయినంత ఎక్కువగా ప్రచారం కల్పించి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనేలా చేయాలి.
6. ఏరియాను బట్టి వార్డు కమిటీలకు ఆస్తి పన్నులో వాటా ఇవ్వాలి. ఉదాహరణకి బీదప్రాంతంలో 100% మధ్యతరగతి ఆదాయ ప్రాంతంలో 2/3 వాటా రెసిడెన్షియల్ ఇంటి పన్నులో (వ్యాపార ఆస్థులుకాకుండా) ఉన్నత ఆదాయ వర్గాల ప్రాంతాలలో 1/3 వాటా రెసిడెన్షియల్ ఇంటి పన్నులో (వ్యాపార ఆస్థులుకాకుండా).
7. మిగిలిన పన్ను మున్సిపల్ బడ్జెట్ సెంట్రల్ పూల్ లోకి వెళుతుంది.
8. స్థానిక పన్నులను మున్సిపాలిటీ విధివిధానాలకు అనుగుణంగా విధించే అధికారం వార్డు కమిటీకి వుండాలి. అంటే వార్డు కమిటీ అనేది ఒక గ్రామపంచాయితీలాగా పనిచేయాలి.
9. విరాళాలు మరియు ఇతర సహాయాల ద్వారా వార్డు కమిటీ తన వనరులను పెంచుకోగలగాలి.

ఇక ప్రజలకు అధికారాలు బదిలీ అనే లక్ష్యం, స్ఫూర్తికి అర్థమేముంది?... అంటే ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కమిటీలు, సభల ఏర్పాటు వల్ల ఒరిగేదేమీ ఉండదు" ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశాకే అవి కూడా ఏర్పడతాయని తెలిపింది. అదెప్పుడు అనే అంశంపై సైతం స్పష్టత లేదు.

ఈ జి.వో.ల ప్రకారం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వార్డు కమిటీలు ఏర్పడతాయి. కాని వాటిని ఏర్పాటు చేస్తున్న విధి విధానాలను

గమనిస్తే ప్రభుత్వం తన అధికారాలను ఎంతగా దుర్వినియోగ పరుస్తున్నది అర్థం అవుతుంది.

ముందుగా రాజ్యాంగంలోని 74వ సవరణ ద్వారా వచ్చిన ఆర్టికల్ 243-'ఎస్' వార్డు కమిటీల గురించి ఏం చెబుతోందో చూద్దాం.

వార్డు కమిటీల ఏర్పాటు ద్వారా నగర స్థానిక ప్రభుత్వాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాజ్యాంగంలోని 74వ సవరణ ద్వారా సంస్థాగతమైన ఏర్పాటుకు వీలు చిక్కింది.

## రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ఎస్ ప్రకారం:

**1.** మూడు లక్షలుకాని అంతకుమించిగాని జనాభావున్న మున్సిపాలిటీల భౌగోళిక పరిధిలోని ఒకటి లేదా అంతకు మించిన వార్డులను కూడిన వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలి.

**2.** రాష్ట్ర అసెంబ్లీ చట్టంద్వారా ఈక్రింది ఏర్పాటును చేయవచ్చు.

ఎ) వార్డు కమిటీ యొక్క భౌగోళిక పరిధిని మరియు కంపోజిషన్

బి) వార్డు కమిటీ ఏర్పరచే (నింపే) విధానము

**3.** వార్డు కమిటీ భౌగోళిక పరిధిలోని వార్డు నుండి మున్సిపాలిటీకి ప్రతినిధిగా ఎంపికైన సభ్యుడు ఆవార్డు కమిటీలో సభ్యుడుగా వుండాలి.

**4.** వార్డు కమిటీ భౌగోళిక పరిధిలో

ఎ) ఒక వార్డు మాత్రమే వున్నట్లయితే, ఆ వార్డు నుండి మున్సిపాలిటీ ప్రతినిధిగా ఎంపికైన సభ్యుడు లేదా

బి) రెండు లేక ఎక్కువ వార్డులు వున్నట్లయితే ఆ వార్డుల నుండి మున్సిపాలిటీ ప్రతినిధులుగా ఎంపికైన సభ్యుల నుండి వార్డు కమిటీ ద్వారా ఎన్నుకోబడిన సభ్యుడు

ఆ వార్డు కమిటీకి ఛైర్‌పర్సన్‌గా వుంటాడు.

**5.** ఈ ఆర్టికల్‌లోని ఏ విషయం కాని, వార్డు కమిటీ కాని, రాష్ట్ర అసెంబ్లీ కానీ వార్డు కమిటీ ఏర్పాటులో ఏవైనా ఏర్పాటు చేయదలచుకున్నట్లయితే ప్రతిబంధకం కాజాలవు.

వార్డు కమిటీలను ఏర్పాటు చేసే విధానం, అనుభవాలు ఒక రాష్ట్రానికి మరో రాష్ట్రానికి విభిన్నంగా వున్నాయి.

## లోక్‌సత్తా పార్టీ ఏం చెబుతోంది?

నేటి మన మున్సిపల్ పాలనలో రాజకీయ నాయకుడు, అధికారి, కాంట్రాక్టర్ అనే మూడు గ్రహాల కూటమి మన బ్రతుకులతో ఆడుకుంటున్నాయి. ఈ మూడు గ్రహాల కూటమిని అదుపులోనికి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. మున్సిపల్ పాలనలో మార్పులు రావాలి. పాలన మొత్తం ప్రజల కొరకు మరియు ప్రజల చుట్టూ తిరిగే విధంగా ఉండాలి. వార్డు స్థాయి నుంచి ప్రజల భాగస్వామ్యం, పారదర్శకత మరియు స్థానిక అవసరాలకు తగినట్లు ప్రణాళిక మరియు నిధులు ఉండాలి. అప్పుడు పట్టణాలలో పేదవారికి కనీససేవలు అందుతాయి.

మున్సిపల్ పాలనలో మార్పుల కొరకై లోక్‌సత్తా ' ఓట్ హైదరాబాద్' అనే ఉద్యమాన్ని జూన్ 2007 సంవత్సరంలో మొదలుపెట్టింది. ఈ ఉద్యమంలో హైదరాబాదులోని చాలా స్వచ్ఛంద సంస్థలు మరియు మేధాపాట్కర్ వంటి జాతీయస్థాయి ఉద్యమకారులు పాల్గొన్నారు. ఉద్యమంలో భాగంగా మున్సిపల్ పాలనలో మార్పులు కావాలని పేదప్రజలు మరియు ఉద్యమకారులు సుమారు 5 వేల పోస్టుకార్డులు గౌ॥ ముఖ్యమంత్రిగారికి రాయడం జరిగింది. మాజీ హైకోర్టు జడ్జిల ఆధ్వర్యంలో చర్చాగోష్టులు నిర్వహించడం, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలందరికీ తెలుపడం జరిగింది.

ఇదే సమయంలో కేంద్రప్రభుత్వ అర్బన్ రెన్యువల్ మిషన్ వారు కూడా మున్సిపల్ పాలనలో సంస్కరణలు తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. దీంతో ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ పాలనలో సవరణలు తెస్తూ, యాక్ట్ 7 ఆఫ్ 2008ను తీసుకొని వచ్చింది. ఈ చట్టం పౌరసంస్థలు కోరినట్లు హైదరాబాదు మున్సిపల్ చట్టం 1955ను మరియు 1965 ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టాలలో మార్పులు చేస్తూ , వార్డు స్థాయిలో పారదర్శకత మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతుంది. ఇది లోక్‌సత్తా సాధించిన ఒక మంచి విజయం. అయితే ఈ చట్టం కార్యరూపాన్ని దాల్చడానికి సంబంధిత రూల్సు చేయవలసిన అవసరం ఉంది. దానికి కొద్ది సమయం పట్టవచ్చు. <u>యాక్ట్ 7 ఆఫ్ 2008లో చేసిన సవరణలు రాష్ట్రంలోని ఇతర 14 కార్పొరేషన్లకు మరియు 119 మున్సిపాలిటీలకు కూడా వర్తిస్తాయి.</u>

## <u>సవరించిన యాక్ట్ 7ఆఫ్ 2008 లోని కొన్ని ముఖ్యమైన అంశాలు</u>

**సెక్షన్ 2 :**

<u>హైదరాబాదు మున్సిపల్ చట్టం 1955కు సవరణ</u>

ఎ) ప్రతివార్డులో ఎన్నుకున్న కార్పొరేటర్ అధ్యక్షతన ఒక వార్డు కమిటి ఏర్పాటు అవుతుంది. అందులో 10 మందికి మించకుండా (4 వేల జనాభాకు ఒకరు చొప్పున) మున్సిపల్ కార్పొరేషన్ ఆ వార్డులో గల పౌరసేవా సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, వ్యాపార ఉద్యోగ సంఘాలు, ఇతర సామాజిక కార్యకలాపాలు నిర్వహించే సంస్థల నుంచి వార్డు కమిటీని నియమిస్తుంది. ఇందులో సగం మంది మహిళలు ఉంటారు.

బి) వార్డులో గల ఏరియా సభల ప్రతినిధులు కూడా వార్డు కమిటీలో మెంబర్లు.

### కార్పొరేషన్ స్థాయిలో వార్డు కమిటీ నిర్మాణం

వార్డు కమిటి <u>ఎన్నుకున్న కార్పొరేటర్ అధ్యక్షులు</u>
10కి మించకుండా పౌరసేవా సంస్థల ప్రతినిధులు
ఏరియాసభల ప్రతినిధులు

ఏరియా సభ
ఏరియా సభ ప్రతినిధి
2-5 వేల జనాభా

**సెక్షన్ 4 :**

వార్డు కమిటీ కాల పరిమితి సంబంధిత మున్సిపాలిటీ కాలపరిమితితో సమానంగా ఉంటుంది. వార్డు కమిటీ విధి విధానాల కొరకు రూల్సు తయారు చేయబడతాయి.

**సెక్షన్ 6 :**

సి) వార్డు కమిటీ ఈ క్రింద తెలిపిన పనులు నిర్వహిస్తుంది.

**1. అజమాయిషీ :**

☞ సానిటేషన్ మరియు డ్రైనేజి పనులు

☞ నీటి సరఫరా

- వీధిదీపాలు
- రోడ్ల రిపేరు
- మార్కెట్ యార్డులు
- పార్కులు, ఆటస్థలాలు
- పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలు
- మున్సిపల్ ఆధీనంలో ఉన్న స్కూళ్ళు, ప్రసూతి వైద్యశాలలు, ఆసుపత్రులు
- పన్నుల వసూళ్ళలో సహాయం
- పెన్షన్, సబ్సిడీ వంటి లబ్ధిదారుల పట్టిక తయారు చేయటం
- రూల్సులో చెప్పబడిన పద్ధతిలో వార్డు అభివృద్ధి ప్రణాళిక తయారు చేయటం
- వార్డులో గల ప్రాథమిక అవసరాల పట్టిక తయారు చేయటం
- మున్సిపల్ ఆస్తుల పట్టిక తయారుచేయటం
- ప్రభుత్వ పథకాల అమలులో సహాయం
- అవసరమైన ఏవైనా ఇతర కార్యక్రమాలు

**సెక్షన్ 7 :**

**వార్డు కమిటీ హక్కులు :**

- వార్డు కమిటీలకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని కమీషనర్ నుండి రాబట్టుట
- మున్సిపాలిటీలోని మాస్టర్‌ప్లాన్ లేదా జోనల్ ప్లాన్ పొందుట
- మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడ్జెట్‌పై పూర్తి సమాచారం
- వార్డు పరిధిలోని భూమి ఉపయోగం మరియు జోన్ రెగ్యులేషన్‌పై వార్డు కమిటీవారిని మున్సిపాలిటీ విధిగా సంప్రదించుట

**సెక్షన్ 8 :**

- మున్సిపల్ కార్పోరేషన్ వార్షిక బడ్జెట్‌లో 20% బడ్జెట్‌ను, సానిటేషన్, డ్రైనేజి, త్రాగునీరు, రోడ్లు, వీధిదీపాలు పార్కులు మార్కెట్ల పనులు నిర్వహించడానికి వార్డు కమిటీలకు అందజేస్తుంది. ఇలా అందజేసిన డబ్బులు ఏవిధంగా ఖర్చు చేయాలో రూల్సులో రూపొందిస్తారు.

**సెక్షన్ 9 :**

- వార్డు కమిటీకి అవసరమైనప్పుడు తమ కమిటీ మెంబర్లతో కొన్ని సబ్ కమిటీలు వేసుకోవచ్చు. అవసరమైనప్పుడు విచారణ, సలహాలు లేక ఏదైనా ఇతర విషయాలపై ఇట్టి సబ్ కమిటీల సలహా తీసుకోవచ్చు.

**ఏరియా సభ (8 బి)**

- జనాభా ప్రాతిపదికన ప్రతి వార్డును కొన్ని ఏరియా సభలుగా విభజిస్తారు. సాధ్యమైనంత వరకు రెండు నుంచి ఐదు వేల జనాభాతో ఒక ఏరియా సభ ఉంటుంది. ఆ ఏరియాలోగల అందరు ఓటర్లు ఆ ఏరియా సభలో సభ్యులుగా ఉంటారు. ప్రతి ఏరియా సభకు ఒక ప్రతినిధిని మున్సిపల్ కార్పొరేషన్ నియమిస్తుంది. (నామినేట్) ఏరియాసభ కాల పరిమితి మున్సిపల్ కార్పొరేషన్‌తో సమానంగా ఉంటుంది.

**ఏరియా సభ విధివిధానాలు :**

- ఏరియాలో అవసరాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళిక తయారుచేసి వార్డు అభివృద్ధి ప్రణాళికలో చేర్చడానికి వార్డు కమిటీకి పంపించుట.
- వార్డు ఏరియాలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక మరియు అట్టి పట్టిక వార్డు కమిటీకి పంపుట మరియు ప్రస్తుత లబ్ధిదారుల పరిశీలన.
- త్రాగునీరు, రోడ్లు, వీధిదీపాల వంటి వాటిలోని లోపాలను గుర్తించి సరిదిద్దుటకై వార్డు కమిటీకి తెలుపుట.
- కుళాయి, వీధిదీపాలు, మరుగుదొడ్ల వంటి వాటిని వార్డులో ఎచ్చటెచ్చట నిర్మించాలో(లొకేషన్), వార్డు కమిటీకి సూచనలు.
- ప్రజా ఆరోగ్య కేంద్రాల పనిలో సహాయం.
- పన్నుల వసూలులో సహాయం.

**ఏరియాసభ హక్కులు :**

## జర్మనీలో మున్సిపాలిటీలు

జర్మనీలో పురపాలక సంఘాలకు ఈ క్రింది పేర్కొన్న సార్వభౌమాధికారాలు ఉన్నాయి. ఈ సార్వభౌమాధికారాలను ఉల్లంఘించే అధికారం ఫెడరేషన్‌కు (అంటే కేంద్ర ప్రభుత్వం) కాని 'లాన్‌డర్'కి గాని చట్టాల పరిధిలో లేవు.

1. **సిబ్బంది సార్వభౌమత్వం :** పురపాలక సంఘాలకు సిబ్బంది ఎంపిక, పదోన్నతి కల్పించుట మరియు బర్తరఫ్ చేయుట వంటి అధికారాలు ఈ సార్వభౌమత్వం ద్వారా కల్పించటం జరిగింది.
2. **వ్యవస్థాపక సార్వభౌమత్వం :** పురపాలక సంఘం తన అధికార వ్యవస్థను రూపొందించుకునే అధికారాన్ని ఈ సార్వభౌమత్వం ద్వారా కల్పించటం జరిగింది.
3. **ప్రణాళికా సార్వభౌమత్వం :** పురపాలక సంఘం, పట్టణాభివృద్ధి పథకాల రూపకల్పన వాటి అమలుకు అవసరమైనచో భూములను సంఘటిత పరిచే అధికారం ఈ సార్వభౌమత్వం ద్వారా కల్పించటం జరిగింది.
4. **శాసనిక సార్వభౌమత్వం :** పురపాలకా నిబంధనావళి రూపకల్పన చేసే అధికారం ఈ సార్వభౌమత్వం కల్పించటం జరిగింది.
5. **ఆర్థిక సార్వభౌమత్వం :** తమ ఆదాయ వ్యయాల పూర్తి నిర్వహణాధికారాన్ని పురపాలక సంఘాలకు ఈ సార్వభౌమత్వం ద్వారా కల్పించటం జరిగింది.
6. **పన్నుల సార్వభౌమత్వం :** పురపాలక సంఘం పన్నులు విధించే అధికారాన్ని (పై ప్రభుత్వాలు ఆ పన్నులను ఉపసంహరించనంత వరకు) ఈ సార్వభౌమత్వం ద్వారా కల్పించటం జరిగింది.

Source: Legal Texts Local Government Constitution Information From the Republic of Germany

- సంబంధిత అధికారుల నుంచి, ఏరియాలో జరుగుపనుల గురించి మరియు సంబంధిత అధికారులు అందించు సహాయ సహకారాల గురించి అలాగే వచ్చే మూడు నెలల కాలంలో జరిగే పనుల గురించి సమాచారం పొందవచ్చు. తమ ఏరియా సభకు సంబంధించి వార్డు కమిటీ వారు తీసుకున్న నిర్ణయం గురించి సమాచారం పొందవచ్చు.
- తమ ఏరియాకు సంబంధించిన నిర్ణయాలపై మరియు తీసుకున్న చర్యలు.(యాక్షన్ టేకెన్ రిపోర్టు పొందుట)
- పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ వంటి వాటిపై పౌరులకు అవగాహన పెంచుట.

**సెక్షన్ 686 ఎ (1) :**

- మున్సిపల్ కార్పొరేషన్ వారు తమ వద్ద ఉన్న సమాచారాన్ని ఇండెక్సింగ్ చేసి ప్రతి మూడు నెలలు, ఆరు నెలలు మరియు సంవత్సరం కాల వ్యవధిలో అందరికీ అర్థమయ్యే విధంగా పత్రికల ద్వారా, ఇంటర్నెట్, నోటీస్ బోర్డు, కరపత్రాల ద్వారా ప్రజలకు విధిగా తెలియచేయాలి. (గమనిక:ఈ పని చేయాలని సమాచారహక్కు చట్టం 2005 కూడా చెపుతుంది)

**<u>తెలుపవలసిన సమాచారం :</u>**

- మున్సిపల్ కార్పొరేషన్ గురించిన ప్రాథమిక సమాచారం మరియు కార్పొరేషన్ కూర్పు మరియు అధికారుల, సిబ్బంది వివరాలు
- కార్పొరేషన్ మినిట్స్ పొందుటకు పద్ధతి
- అనుమతులు, పర్మిట్లు, రాయితీలు వంటి వాటికి సంబంధించిన అధికారి మరియు సంబంధిత సెక్షన్లు మరియు వాటిని మంజూరు చేయు అధికార్ల పేర్లు, ఫోను నంబర్లు.
- ప్రతి మూడు నెలల కొకసారి ఆదాయ వ్యయ పట్టికలు మరియు దానికి సంబంధించిన విషయాలు
- ఆర్థిక సంవత్సరం ముగిసిన ఆరునెలలలో ఆడిట్ అకౌంట్స్ వివరాలు
- త్రాగునీరు, డ్రైనేజి, రోడ్లు, వీధిదీపాలు, పార్కులు వంటివి ఏ స్థాయిలో నిర్వహిస్తారో (సర్వీస్ లెవల్) వివరణ.
- అన్ని ముఖ్యపనులపై ప్రణాళికలు, వాటి కేటాయింపు మరియు అయిన ఖర్చు, చేసిన పనుల వివరణ
- లబ్ధిదారుల ఎంపికలో పాటించే పద్ధతి వివరణ
- లబ్ధిదారుల పట్టిక
- క్రిందటి సంవత్సరంలో బకాయిపడిన పన్నుల వివరాలు మరియు సంవత్సరానికి లక్ష పైబడిన పన్ను బకాయిపడిన (డిఫాల్టర్స్) వ్యక్తుల వివరాలు.
- బడ్జెట్‌కు సంబంధించిన ఇతర అన్ని వివరాలు

**<u>ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం 1965కు సవరణలు</u>**

**సెక్షన్ 5 బి :**

- ప్రతి మున్సిపాలిటీలో వార్డు కౌన్సిలర్ అధ్యక్షతన వార్డు కమిటీ ఏర్పాటు చేయాలి. అందులో పౌర సమాజం నుంచి పదిమందికి మించకుండా ప్రతినిధులను కార్పొరేషన్ ఎంపిక చేస్తుంది. పదివేల జనాభాకు నలుగురు, తదుపరి ప్రతి నాలుగువేల జనాభాకు ఒకరు చొప్పున (పదికి మించకుండా) ప్రతినిధులు ఉంటారు.

వార్డును ఏరియాలుగా విభజించి, ప్రతి ఏరియా నుంచి ఒక ప్రతినిధి ఏరియాసభ ప్రతినిధిగా వార్డు కమిటీలో సభ్యుడుగా ఉంటాడు. ఏరియా ప్రతినిధిని కార్పొరేషన్ నియమిస్తుంది.

వార్డు కమిటీ, విధివిధానాలు, బాధ్యతలు (కొద్ది మార్పులతో) మునిసిపల్ కార్పొరేషన్‌లో సూచించిన విధంగా ఉంటాయి.

<u>మున్సిపాలిటీలలో వార్డు కమిటి నిర్మాణం (లక్షపైన జనాభా ఉన్న మున్సిపాలిటీలకు)</u>

**వార్డు కమిటి**

| **<u>ఎన్నుకున్న కార్పొరేటర్ అధ్యక్షులు</u>** |
|---|
| **10 కి మించకుండా పౌరసేవా సంస్థల ప్రతినిధులు** |
| ఏరియా సభల ప్రతినిధులు<br>ఏరియాసభ<br>ఏరియాసభ ప్రతినిధి |

1–2 వేల వరకు జనాభా

<u>మున్సిపాలిటీలలో వార్డు సభల నిర్మాణం( లక్షకు తక్కువ జనాభా ఉన్న మునిసిపాలిటీలకు)</u>

**వార్డు సభ**

ఎన్నుకున్న కార్పొరేటరు అధ్యక్షులు

వార్డులో గల ఓటర్లు, సభ్యులు

**సెక్షన్ 5 సి :**

<u>ఏరియా సభ ఏర్పాటు :</u> ఒక లక్ష జనాభాకు మించిన ప్రతి మున్సిపాలిటీలో ప్రతి వార్డులో వేయినుంచి రెండువేల జనాభా కలిగిన ఏరియా సభగా విభజిస్తారు.

ఏరియాసభ విధివిధానాలు, హక్కులు, బాధ్యతలు (కొద్దిపాటి మార్పులతో) కార్పొరేషన్‌లలో తెలిపిన విధంగానే

**సెక్షన్ 5 డి :**

ఒక లక్ష జనాభాకు తక్కువగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో ప్రతివార్డుకు ఒక వార్డు సభ స్థాపించాలి. (ఇచ్చట గమనించవలసిన విషయం, మున్సిపాలిటీ జనాభా లక్షపైన ఉన్న <u>వార్డు కమిటీ,</u> <u>ఏరియాసభ</u> ఉంటాయి. జనాభా లక్షలోపున ఉన్న, ఒక <u>వార్డు సభ</u> మాత్రమే ఉంటుంది)

వార్డు సభ విధి విధానాలు, హక్కులు పైన చెప్పిన వార్డు కమిటీలో ఉన్న మాదిరిగానే ఉంటాయి.

**సెక్షన్ 389 సి :**

ప్రతి మున్సిపాలిటీ తన వద్ద ఉన్న సమాచారాన్ని ప్రతి మూడు నెలలకు, ఆరు నెలలకు, సంవత్సరానికి విధిగా ప్రజలకు తెలపాలి.(పైన తెలిపినట్లుగా కార్పొరేషన్‌కు వర్తించిన విధంగా మున్సిపాలిటీలు కూడా అన్ని వివరాలు తెలపాలి)

**గమనిక :** సవరించిన చట్టం 7 ప్రకారం ఏరియాసభ ప్రతినిధి మరియు వార్డు కమిటీలోని ప్రతినిధుల నియామకం సరిగా జరిగిన మున్సిపాలిటీలో ప్రజల భాగస్వామ్యం పెరిగి, పారదర్శకతతో అవినీతి తగ్గుతుంది. అలాగే స్థానిక అవసరాలైన మంచినీరు, డ్రైనేజి, రోడ్లు, విద్యుత్ దీపాలు వంటి వాటిపై ప్రాధాన్యత పెరిగి, పేదవారికి కొంత ఊరట కలుగుతుంది.

రాజ్యాంగంలోని 74వ సవరణ ద్వారా మున్సిపాలిటీలకు స్థానిక ప్రభుత్వాల ప్రతిపత్తి కల్పించారు. రాజ్యాంగంలోని 12వ షెడ్యూలు ద్వారా మున్సిపాలిటీలకు 18 అంశాలు కేటాయించారు. ఈ అంశాలపై మున్సిపాలిటీలకు అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు దఖలుపర్చాలి.

ఈ అంశాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకునే అమలు జరుపుకునే అధికారాలు మున్సిపాలిటీలకు ఉండాలని రాజ్యాంగం సూచించింది.


**రాజ్యాంగ 12వ షెడ్యూలులో మున్సిపాలిటీలకు దఖలు పర్చాలని సూచించిన 18 అంశాలు**

1. టౌన్ ప్లానింగ్‌తో సహా అర్బన్ ప్లానింగ్
2. భూమి వినియోగం, భవనాల నిర్మాణంపై నియంత్రణ
3. ఆర్థిక, సామాజికాభివృద్ధి ప్రణాళికలు
4. రోడ్లు, బ్రిడ్జ్‌లు
5. గృహ, పారిశ్రామిక, వాణిజ్య వినియోగాలకు నీటి సరఫరా
6. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, వ్యర్థ పదార్థాల తొలగింపు
7. అగ్నిమాపక సేవలు
8. పట్టణ, సామాజిక వనాలు, పర్యావరణ పరిరక్షణ, జీవావరణ సమతౌల్యత పెంపొందించడం
9. మానసిక, శారీరక వికలాంగులతో సహా సమాజంలో బలహీన వర్గాల ప్రయోజనాల పరిరక్షణ
10. మురికివాడల అభివృద్ధి మెరుగుదల
11. పట్టణ దారిద్ర్య నిర్మూలన
12. పార్కులు, వనాలు, ఆటస్థలాలు, వంటి సౌకర్యాల కల్పన
13. విద్యా సాంస్కృతిక రంగాల అభివృద్ధి
14. స్మశాన వాటికల ఏర్పాటు, నిర్వహణ, విద్యుత్ స్మశాన వాటికల ఏర్పాటు
15. బందెల దొడ్లు, జీవహింస నిరోధం
16. జనన మరణాల నమోదు, ఇతర ముఖ్య గణాంకాలు నమోదు
17. వీధిదీపాలు, బస్‌స్టాపులు తదితర పౌర సౌకర్యాలు
18. కబేళాలు, తోళ్ళ పరిశ్రమలు నియంత్రించడం

పురపాలక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాల కన్నా నిడివిలో, జనాభాలో చిన్నవి. అంతేకాని ఏ రకంగానూ తక్కువ మాత్రం కాదు. ఇది కిందవి కాదు, నిజానికి ఇవే పౌరులకు దగ్గరగా ఉన్నవి. అంచేత నిజమైన ప్రభుత్వాలు ఇవే. 80 సం॥ క్రితం కలకత్తా నగర కార్పొరేషన్ ఎన్నికల్లో దేశభక్త చిత్తరంజన్‌దాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆయన గవర్నర్ దగ్గరకు వెళ్ళి నగర కమిషనర్‌గా తనకు కావాలసిన వ్యక్తిని నియమించుకునే అధికారం కావాలని అడిగారు. ఆ గవర్నర్ కాస్త ఆలోచించి మీ ఇష్టం వచ్చిన ఐ.సి.ఎస్. అధికారిని ఎంపిక చేసుకోండి అన్నారు. అందుకు చిత్తరంజన్‌దాస్ ఒప్పుకోలేదు. తనకిష్టం వచ్చిన పౌరుణ్ణి కమిషనర్‌గా పెట్టుకుంటానని అన్నారు. తర్జనభర్జనల అనంతరం గవర్నర్ అందుకు అంగీకరించారు. అలా కలకత్తా కమిషనర్‌గా నియమితుడైన 24 ఏళ్ళ కుర్రాడే, ఆ తరువాత కలకత్తాకు మేయర్ అయ్యాడు. ఆ తరువాత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. మన హృదయాల్లో నేతాజీగా సుస్థిరస్థానం సంపాదించుకున్నాడు. ఆ రోజుల్లో, వలస పాలనలోనే కలకత్తా నగర కమీషనర్ నియామకమే ఎన్నికైన మేయర్ అభీష్టం ప్రకారం జరిగింది. ఈ రోజు హైదరాబాద్ వదలిపెట్టండి. గుంటూరు వదలిపెట్టండి. కనీసం ఒక బిగ్రేడ్ మున్సిపాలిటీలోనైనా తనకిష్టం వచ్చిన అధికారిని నియమించుకునే అధికారం స్థానిక ప్రభుత్వాలకుందా? మనకు మరి ఆనాడు స్వాతంత్ర్యం ఉందా, ఈనాడు ఉందా? ఆ ప్రశ్న వినడానికి కష్టంగా ఉండవచ్చు. కాని ఈ ప్రశ్న మనం వేసుకోవాలి.

**ప్రభుత్వ వైఖరి సమంజసమేనా...?**

ఇక్కడ అత్యంత ముఖ్యమైన మౌలిక సందేహం ఒకటి వస్తుంది. ప్రజల ఓటుతో ఎన్నికైన ప్రతినిధులను ఒక నిర్దేశించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? అంటే ప్రజల ఓట్లతో ఎంపికైనా మంత్రి లేదా ముఖ్యమంత్రి అదే ఓటుతో ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్ కంటే తాము గొప్పవారమని భావిస్తున్నారా? ఇదే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని సహిస్తుందా? ఖచ్చితంగా కాదనే సమాధానం. రాష్ట్రాల హక్కులను కేంద్రం కాలరాస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వాపోతున్నది. నిజానికి రాష్ట్రం, కేంద్ర ఆధిపత్యాన్ని అడ్డుకోవడం సమంజసమైనదే. కాని దురదృష్టవశాత్తూ రాష్ట్రప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలపై చెలాయిస్తున్న పెత్తనాన్ని అదే దృష్టితో



## ప్రజలకే అధికారం - పంచాయతీరాజ్

**1950 అక్టోబరు రెండో తేదీన రాజస్థాన్ రాష్ట్రంలోని నాగోర్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రసంగంలోంచి కొంతభాగం.**

"ప్రజాస్వామ్యానికి పునాదిరాయి అయిన పంచాయతీరాజ్‌ను ఈ రోజున మనం ప్రారంభించుకుంటున్నాం. రాజస్థాన్ రాష్ట్రం భౌగోళికంగానూ, చారిత్రాత్మకంగానూ కూడా కీలకమైన ప్రాధాన్యం కలిగి వుంది. ఈ రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యం తాలూకు ఘనమైన బాధ్యతలు పూర్తి చేయడానికి స్వయంగా కంకణ బద్ధులయ్యారు. రాజస్థాన్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించడం ద్వారా ఈ బాధ్యతను ప్రజలకు అందజేసింది. ఇది ఒక చారిత్రాత్మక సన్నివేశం. మహాత్మాగాంధీ జన్మదినం నాడే ఈ పంచాయతీ రాజ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సముచితంగా వుంది.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మనదేశంలో ప్రజాపాలన స్థాపించాం. ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాం. ప్రజలందరూ అసెంబ్లీకి, పార్లమెంటుకు ఆయా ప్రతినిధులను ఎన్నుకునే హక్కును అనుభవిస్తున్నారు. ఇది సరైన దిశలో వేసిన సరైన అడుగు.

అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు, రూపకల్పన చేసే బాధ్యత – అమలు జరిపే కర్తవ్యం ప్రజల చేతికి అప్పగించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ బాధ్యతను నమ్మకంతోనూ, సాహసంతోనూ పూర్తిచేసే బాధ్యత భుజాలకెత్తుకోవలసిందిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. భారతదేశ ప్రజలు రాజస్థాన్ గ్రామీణ ప్రజానీకాన్ని ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇక్కడే కాదు భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా ప్రజలకు అప్పగించిన కర్తవ్యం సత్ఫలితాలను ఇస్తుందన్నది నా అచంచల విశ్వాసం".

చూడడం లేదు. రాజ్యాంగం 12వ షెడ్యూలులోని 18 అంశాలలో 8 అంశాలను నగర పాలికలకు దఖలు పరిచినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేవు. విధులు, సిబ్బంది, నిధులు, అధికారాలు బదలాయించడానికి బదులుగా సూచనలు, సలహాలు, సమీక్షల అవకాశాలు కల్పించి ఇవే అధికారాలని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నది. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి లానే ఎన్నికైన స్థానిక సంస్థల నాయకులకు కూడా ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవలసిన బాధ్యత ఉన్నది. ఒకవేళ వారు తప్పుచేస్తే ఓటేసిన ప్రజలే వారిని శిక్షిస్తారు. కేవలం అవినీతి, అక్రమాలకు పాల్పడినవారినే చట్టం శిక్షిస్తుంది.

స్థానిక ప్రభుత్వాల కంటే హైదరాబాద్, ఢిల్లీ గద్దెలపై కూర్చున్న ప్రభుత్వాలే శక్తివంతమైనవని అనుకోవడం అర్థరహితమైనది. అంతేకాదు పాలనావిధానంలో లోసుగులతో కూడిన పక్షపాత వైఖరికి అది నిదర్శనం. ఫెడరల్ విధానంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య విభేదాలు ఆ శాఖల పరిధి, అవి చేపట్టే వేరు వేరు కార్యక్రమాల నిర్వహణా సామర్థ్యాన్ని బట్టి ఉంటాయి. పైస్థాయి ప్రభుత్వమా, కింది స్థాయి ప్రభుత్వమా అన్నది కాదు ప్రశ్న, ప్రజలకు అది దగ్గరగా ఉన్నదా, దూరంగా వున్నదా అనేదే. ప్రజల దైనందిన సమస్యలు అంటే విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం విధులను, ప్రజలకు దగ్గరగా వున్న ప్రభుత్వానికి అప్పగించాలి. స్థానిక ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు చేయలేని పనులను పైస్థాయి ప్రభుత్వం చేపట్టాలి.

ఇతర ప్రభుత్వ శాఖల మాదిరిగానే స్థానిక ప్రభుత్వాలకు కూడా చట్టపరమైన అధికారాలున్నాయన్న విషయాన్ని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతేకాదు ప్రభుత్వాలు నాయకుల హోదా, బాధ్యతలను బట్టి వారిని గౌరవంగా చూడాలి. అప్పుడే ఆశించిన సుపరిపాలన వాస్తవమౌతుంది. అంతేకాదు ప్రజలు తమ సంక్షేమానికి, ఓటుకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తిస్తారు.

**లోక్‌సత్తా సూచనలు:** లోక్‌సత్తా కోటి సంతకాల ఉద్యమ ఫలితంగా స్థానిక ప్రభుత్వాల సాధికారత సమస్యలపై నవంబరు 6, 2004 తేదీన మంత్రివర్గ ఉపసంఘంతో జరిగిన చర్చల్లో లోక్‌సత్తా సాధికారత సమాఖ్య కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొని పలు సూచనలు చేశారు. 1. నగర పాలికలకు రాజ్యాంగం సూచించిన అంశాలను తక్షణం బదిలీచేయాలి. 2. ఈ అంశాలకు సంబంధించిన జిల్లాస్థాయి ప్రభుత్వ శాఖలను, సంస్థలను జిల్లా పరిషత్ అధీనంలోకి తేవాలి. 3. ఈ శాఖల సిబ్బందిని డిప్యూటేషన్ మీద స్థానిక ప్రభుత్వాల అధీనంలో ఉంచాలి. 4. ప్రజలు చెల్లించే పన్నులలో ఒక వాటా చట్టబద్ధంగా స్థానిక ప్రభుత్వాలకు బదలాయించే ఏర్పాటు తక్షణం జరగాలి. 5. రాష్ట్ర బడ్జెట్‌లో 50% స్థానిక సంస్థలకు కేటాయిస్తూ జిల్లావారీ కేటాయింపులతో బడ్జెట్‌ను రూపొందించాలి. 6. నగర పాలికలను స్థానిక ప్రభుత్వాలుగా రూపొందించటానికి ఈ అంశాలు ప్రాతిపదికగా ఉండాలి. 7. నగర పాలికలను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. 8. జిల్లా పరిషత్‌ల నెత్తిమీద పెత్తనం చేసే డిడిఆర్‌సి ని వెంటనే రద్దు చేయాలి. 9. రాజ్యాంగం నిర్దేశించిన జిల్లా ప్రణాళిక కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలి. 10. దీనికి జిల్లా పరిషత్ అధ్యక్షులే ఛైర్‌పర్సన్‌గా ఉండాలి. 11. ప్రతి పోలింగ్‌బూత్‌కు ఓ ఏరియాసభను ఏర్పాటుచేయాలి. 12. తలసరి ప్రతి పౌరునికీ రూ. 1000 వరకూ అదనంగా కేటాయించి వాటిని ఖర్చుచేసే అధికారాన్ని ప్రజలచే ఎన్నికైన ఆ కమిటీలకే అప్పగించాలి. ఉదా: ఈ లెక్కన 70,000 జనాభా ఉన్నవార్డుకు ఏటా రూ. 7కోట్లు అందుతాయి. 13. స్థానిక సమస్యలను పరిష్కరించే ప్రణాళికతో వార్డు మేనిఫెస్టోను తయారు చేసుకునే అధికారాన్ని కూడా పూర్తిగా వాటికే అప్పగించాలి. ఈ సూచనలకు మంత్రివర్గ ఉపసంఘం స్పందిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాల బదలాయింపుకు తగిన చర్యలు వెంటనే తీసుకుంటామని మంత్రివర్గ ఉపసంఘం జేపీకి హామీ ఇచ్చింది. కానీ ఈ హామీకి 6 ఏళ్ళు పూర్తవుతున్నా అధికార బదిలీకి రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం.

ఇటీవల జారీ చేసిన జీవో నెం. 57ను వెంటనే ఉపసంహరించుకుని, వార్డు కమిటీ, ఏరియాసభల రూపకల్పన వెనక ఉన్న స్ఫూర్తిని గుర్తించి, ప్రజలకు వాస్తవ అధికారాన్ని బదిలీ చేసే దిశగా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి. లేకుంటే కాలనీ సంక్షేమసంఘాలు, పౌరసమాజంతో కలిసి లోక్‌సత్తా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుంది.

## కదలి రండి.... మనకోసం... మనం

సమాజంలో ఎప్పుడూ దోపిడీకి గురయ్యేవారు చాలా ఎక్కువ. దోపిడీ చేసేవారు అతి తక్కువ. ఒక గ్రామంలోనో, ఒక చిన్న పట్టణంలోనో ఇలా దోపిడీకి గురయ్యేవారు సంఘటితం కావడం తేలిక. తప్పు చేస్తే నిలదీయడం వాళ్ళకి సాధ్యం అవుతుంది. ఆ విధంగానే ఎన్నికలలో ఓటు వేసేటప్పుడు తాము వేసే ఓటుకి, తమకు జరిగే మంచి చెడులకి మధ్య సంబంధం స్పష్టంగా బోధపడట్లయితే తమ ఓటుని చాలా విచక్షణతో ఉపయోగించుకుంటారు. ప్రస్తుతం చాలా ప్రాంతాలలో తమ ఓటుని అమ్ముకుంటున్నారు. ఎందుకంటే ఎవరికి ఓటు వేసినా, తమ జీవితాల్లో పెద్దగా మార్పు రాదనే నిస్పృహ ప్రజల్లో పెరిగిపోయింది. దీంతో 'చచ్చిన వాడి పెళ్ళికి వచ్చిందే కట్నం' అనే ఉద్దేశ్యంతో తాత్కాలిక ప్రలోభాలకు లొంగిపోతున్నారు. అలాకాక రేపు తాము ఓటు వేసిన పెద్ద మనిషి వల్లనే తమ గ్రామంలో ఉన్న రోడ్లు, మంచినీటి సౌకర్యం, మురుగునీటి పారుదల, పాఠశాల, ఆరోగ్యకేంద్రం, రెవిన్యూ ఆఫీస్, రేషన్‌షాపుల లభివృద్ధి ఆధారపడి ఉన్నాయని తెలిసినప్పుడు, వారిచ్చే డబ్బు కంటే తమ ఓటు విలువ ఎక్కువని ప్రజలు గ్రహిస్తారు. అయితే స్థానిక ప్రభుత్వాలు నిలదొక్కుకోవాలంటే, ఈ వికేంద్రీకరణ నుండి మన ఆశించిన ఫలితాలు పొందాలి. అంటే కొంత ఓర్పు అవసరం. ప్రజాస్వామ్యం పరిణతి కోసం, కనీసం 10, 15 సంవత్సరాలపాటైనా కృషి చేస్తేనే గాని అనుకున్న ఫలితాలు సాధించలేం. ఆ ఓర్పు లేకుండా కేంద్రీకృత పరిపాలనపై ఆధారపడినట్లయితే ఈ దుష్పరిపాలన ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. ఈ పోరాటం మున్సిపల్ ఛైర్మన్ల లేదా కార్పొరేషన్ మేయర్ల లేదా కార్పొరేటర్ల లేదా కౌన్సిలర్ల పెత్తనం కోసం పోరాటం కారాదు. ఇవి ప్రజల కోసం పోరాటం కావాలి. ప్రజల భవిష్యత్తుకై పోరాడే ఉద్యమంగా దీన్ని మనం మలచాలి.

దయచేసి భుజం కలపండి.. కదం తొక్కండి... స్థానిక ప్రభుత్వాల సాధనకై ఉద్యమించండి. ఈ పోరాటంలో లోక్‌సత్తా చివరి వరకు మీ వెంట ఉంటుంది. ఏదో ఆశించి కాదు. ఈ దేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే సాధించాల్సిన మౌలిక మార్పులలో అధికార వికేంద్రీకరణ ప్రధానమైందని లోక్‌సత్తా దృఢంగా విశ్వసిస్తోంది. నిజమైన ప్రజాస్వామ్యం కోసం జరిగే ఉద్యమంలో మీ అందరి నాయకత్వాన్ని, భాగస్వామ్యాన్ని మనసారా అర్థిస్తోంది. ■

### కర్నూలు జిల్లా, పూలతోట గ్రామం లో

## జలశుద్ధి యంత్రం ప్రారంభం



స్వాతంత్ర్యం వచ్చి 62 ఏళ్లు గడచినా గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు ఎదుర్కోవటం బాధాకరమని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం పూలతోటలో 'జలశుద్ధి యంత్రం' ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరులో వరద తీవ్రత గ్రామీణులను అతలాకుతలం చేసిందని, చిన్నారులు రహదారులపై చేయిచాచటం కంటతడి పెట్టించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గొందిపర్ల పంచాయతీ పూలతోట, దొడ్డిపాడు గ్రామాలను దత్తత తీసుకున్నామని తెలిపారు. ప్రజల కోరిక మేరకు పూలతోటలో రూ. 2.90 లక్షలతో 'జలశుద్ధి యంత్రం' ఏర్పాటు చేశామన్నారు. ప్రజల పేరిట చేసే ఖర్చుతో ప్రతి గ్రామంలో వీధి వీధికి ఒక పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. రోడ్లపై పడేసే వస్తువులను తీసుకోవటానికి మనం బిక్షగాళ్లు కాదని, ఆత్మగౌరవంతో బతకాలని ఉద్బోధించారు. గ్రామంలో 18 కుటుంబాలు పుట్టీలు, వలలు పోగొట్టుకున్నారని, పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అవసరమని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతకుముందు విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిన్నారితో స్విచ్ ఆన్ చేయించి 'జలశుద్ధి యంత్రా'న్ని జేపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయేంద్రరెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు వై.డి. రామారావు, జిల్లా అధ్యక్షుడు ఆర్. నరసింహులు, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి ఎన్. జి.శంకర్, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, పాణ్యం ఇన్‌ఛార్జి పద్మ, కె. ఓంకార్, సూర్యనారాయణ, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## 12న కాన్పూర్ ఐ.ఐ.టి స్వర్ణోత్సవ వేడుకలకు జేపీ -13న చెన్నై ఐ.ఐ.టిలో కీలక ప్రసంగం

కాన్పూరు ఐ.ఐ.టి (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) స్వర్ణోత్సవం సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి మూడురోజులపాటు అక్కడ జరిగిన ఉత్సవాల్లో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అతిథిగా పాల్గొన్నారు. 12వ తేదీన జరిగిన కార్యక్రమంలో 'సమకాలీన భారత రాజకీయాల్లో యువత పాత్ర' అనే అంశం మీద జేపీ మాట్లాడారు. టెక్‌క్రితి పేరుతో ఏటా జరిగే ఈ ఉత్సవాలు ఆసియాలోనే అతిపెద్ద, ప్రముఖమైన విద్యార్థి ఉత్సవాలుగా పేరొందాయి. స్వర్ణోత్సవం కావటంతో ఈ ఏడాది మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి. దేశంలోని 600 ప్రముఖ కళాశాలలకు చెందిన సుమారు 10,000మంది విద్యార్థులు, దాదాపు 1500మంది విదేశీ ప్రముఖులు పాల్గొన్నారు. డా॥ పీటర్ గ్రన్‌బెర్గ్ వంటి నోబెల్ విజేతలతోపాటు ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం, వర్గీస్ కురియన్ వంటి దేశీయ ప్రముఖులు కూడా గతంలో ఇక్కడ అతిథులుగా పాల్గొని తమ భావాల్ని పంచుకున్నారు. ఇంజినీరింగ్, శాస్త్రసాంకేతిక, వాణిజ్య అంశాలతోపాటు సామాజిక సమస్యలకు సంబంధించి కూడా లోతైన చర్చలు, సృజనాత్మక పరిష్కారాలను కనుగొనేందుకు ఇక్కడ ప్రయత్నం జరుగుతుంటుంది.

అనంతరం 13వ తేదీన చెన్నై ఐ.ఐ.టిలో జరిగిన కార్యక్రమంలో 'సామాజిక మార్పునకు విద్యాసంస్థలు ఎలా దోహదం చేయగలవు' అనే అంశంపై విద్యార్థులనుద్దేశించి జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు.

## కమిటీ సిఫార్సులు ఏవైనా అంతిమ పరిష్కార బాధ్యత రాజకీయ వ్యవస్థదే -శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలపై లోక్‌సత్తా

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిపై ఏర్పాటైన శ్రీకృష్ణ కమిటీ విధివిధానాలు ఊహించిన విధంగానే ఉన్నాయి.

తెలంగాణ అంశంపై సంప్రదాయ రాజకీయపార్టీల వ్యవహారశైలి వల్లే రాష్ట్రం భావోద్వేగాలపరంగా రెండుగా చీలిపోయింది. పరిస్థితి ఇంతదూరం వచ్చాక పరిష్కారానికి చర్చలే మార్గం. ఈ నేపథ్యంలో ఇరుపక్కలా ఉన్న రాజకీయపార్టీలు, పౌరసమాజ సంస్థలు, విద్యార్థులు, ఇతర వర్గాలవారూ సుహృద్భావ, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పి, సమస్యల అధ్యయనానికి కమిటీకి సహకరించాలి. రెండు ప్రాంతాలవారి మధ్య అగాధాన్ని పూడ్చేందుకు తోడ్పాటునందించాలి. శ్రీకృష్ణ కమిటీ కేవలం అధ్యయన కమిటీ మాత్రమేనని, సూచనలు మాత్రమే అందిస్తుందని గుర్తించి కమిటీని సజావుగా పనిచేయనివ్వాలి.

నిపుణులతో కూడిన కమిటీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిపై అధ్యయనం చేసి వాస్తవాలను నిర్ధారిస్తుంది. అన్నివర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడాలని, సమైక్య రాష్ట్రమే ఉండాలని పరస్పరం సంఘర్షించేలా వస్తున్న డిమాండ్లను పరిష్కరించే మార్గాలను సూచించేందుకు కృషి చేస్తుంది. అయితే ఇది రాజ్యాంగబద్ధ సంస్థ కాదు. పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడినది కాదు. కాబట్టి నివేదించటం తప్ప నిర్ణయాలు చేసే అధికారం కమిటీకి లేదు. అంతిమంగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ మాత్రమే ఏ నిర్ణయమైనా తీసుకోవాలి. అంటే బంతి తిరిగి రాజకీయపార్టీల కోర్టులోనే ఉంటుంది. పార్టీలు ఇప్పటికైనా ప్రజల్ని మభ్యపెట్టటం, తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రజల మధ్య చిచ్చుపెట్టటం ఆపి... విజ్ఞతతో, దూరదృష్టితో, అందరి ఆకాంక్షల్ని, ప్రయోజనాల్ని నెరవేర్చేవిధంగా వ్యవహరించాల్సి ఉంది.

ప్రత్యేక రాష్ట్రం, సమైక్యాంధ్రను భారత ప్రభుత్వం ఏకకాలంలో నెరవేర్చలేదుకాబట్టి హుందాగా చర్చలు జరపటం ద్వారా శాశ్వత, న్యాయబద్ధ పరిష్కారం సాధ్యమవుతుంది.

# సర్వజన సత్తా

**బి.సి., ఎస్.సి., ఎస్.టి.,మైనారిటీ, ఇ.బి.సి.ల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రాజకీయ చైతన్య వేదిక**

డిసెంబర్ 13, 2009వ తేదీన రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో లోక్‌సత్తా పార్టీని మరింత బలోపేతం చేయడానికి బి.సి., ఎస్.సి., ఎస్.టి.,మైనారిటీల భాగసామ్యం అవసరమని 2014 నాటికి బలమైన రాజకీయ శక్తి ఎదగడానికి ఒక వేదిక ఏర్పాటు చేయుటకు నిర్ణయించడమైనది. ఆ ఆలోచన ప్రతి రూపమే "సర్వజన సత్తా" బి.సి., ఎస్.సి., ఎస్.టి.,మైనారిటీ, ఇ.బి.సి.ల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ చైతన్య వేదిక. సమాజం కులాలుగా, వర్గాలుగా విడిపోతూ రాజకీయాలను శాసిస్తున్న తీరు మన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా అభివృద్ధికి ఆటంకంగా తయారైనవి. ఇందుకు "సర్వజన సత్తా"ను ఒక రాజకీయ పరిష్కారంగా లోక్‌సత్తా పార్టీ చూపిస్తుంది. వెనుకబడిన తరగతులు, దళితుల, ఆదీవాసీల, మైనారిటీ, ఇ.బి.సి.ల్లో చైతన్యం తీసుకువచ్చి వారి నాయకత్వాన్ని బలపరచవలసిన అవసరాన్ని గుర్తించింది. రేపు జరగబోవు స్థానిక సంస్థలైన మున్సిపాలిటీ, గ్రామ పంచాయితీ ఎన్నికల నాటికి బలమైన రాజకీయ పార్టీగా రూపుదిద్దడానికి రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లాల వారీగా సదస్సులు, సమావేశాలు, సమ్మేళనాలు, బహిరంగ సభలు నిర్వహించి అన్ని తరగతుల నుంచి మంచి పోరాట పటిమ గల నాయకత్వాన్ని పెంపొందిస్తుంది. 'సర్వజన సత్తా' భవిష్యత్తు ప్రణాళికలను తయారు చేసుకుంటూ లోక్‌సత్తా పార్టీ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయడమే సర్వజనసత్తా లక్ష్యం.

భారతదేశ రాజ్యాంగానికి 60 సంవత్సరాలు నిండిన సందర్భంగా బి.సి., ఎస్.సి., ఎస్.టి.,మైనారిటీ, ఇ.బి.సి. లలో విస్తృత అవగాహన కల్పించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులు విద్య, ఉద్యోగం, వైద్య సదుపాయాలు సామాజిక ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి, వివిధ రాజకీయ పార్టీల వైఖరి, తదితర అంశాలతో "60 ఏండ్ల రాజ్యాంగం బి.సి., ఎస్.సి., ఎస్.టి.,మైనారిటీ, ఇ.బి.సి.లలో స్థితి గతులు"పై అవగాహన సదస్సులు, చర్చాగోష్ఠులు జిల్లా/అసెంబ్లీ నియోజక వర్గం/ మండల / మున్సిపాలిటీ కేంద్రాలలో నిర్వహించాలని నిర్ణయించడమైనది. ఈ సదస్సులకు, జిల్లాలోని ప్రజా సంఘాల, కుల సంఘాల నాయకులను, విద్యార్థులను, మేధావులను మత పెద్దలను, మీడియా, పత్రికా ప్రతినిధులను ఆహ్వానించాలని నిర్ణయించడం జరిగింది.

జిల్లా పార్టీ నాయకులు, జిల్లా కమిటీలతో నియోజకవర్గ కమిటీలతో పాటు అన్ని స్థాయిల్లో ఉన్న కార్యకర్తలు, మహిళాసత్తా, యువసత్తా సభ్యులు తప్పని సరిగా ఈ కార్యక్రమాలకు హాజరు కావలసి ఉంటుంది. మొదటి విడత కార్యక్రమాలు ఉత్తరాంధ్ర జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో విజయవంతంగా నిర్వహించామని చెప్పడానికి సంతోషిస్తున్నాం.

**విజయనగరం (టౌన్)**

**'రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చిన రాజకీయ పార్టీలు**

విజయనగరం : రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు సంక్రమించినప్పటికీ, తద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఆయా సమాజహక్కులు, అభివృద్ధికి దోహదపడకపోగా, రాజకీయ పార్టీల దోపిడీ, అవినీతిలో పడి ద్రోహం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ సర్వజనసత్తా రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య అన్నారు. ఫిబ్రవరి 9న పట్టణంలోని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయంలో సర్వజన సత్తా సమావేశం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ప్రారంభించిన బాబ్జీ మాట్లాడుతూ బి.సి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇ.బి.సి.ల సామాజిక, ఆర్థిక సాంస్కృతిక రాజకీయ వేదికను లోక్‌సత్తా పార్టీలో ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. '60 సంవత్సరాల భారత రాజ్యాంగంలో అభివృద్ధి, వివిధ రాజకీయ పార్టీల వైఖరి, బి.సి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇ.బి.సి.ల స్థితిగతుల'పై ఈ సమావేశంలో చర్చిస్తుందన్నారు. ముఖ్య అతిథి ఈద చెన్నయ్య మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో సంప్రదాయ రాజకీయ పార్టీలు కుల, మత వర్గాల, వంశపారం పర్య రాచరిక వ్యవస్థను, రాజకీయాలను వ్యాపారంగా మార్చి ఓట్లు వేసే యంత్రాలుగా, ప్రజలను డబ్బుకు, మద్యానికి అమ్ముడు పోయే సమాజంగా భావిస్తున్నారన్నారు. సమావేశంలో సర్వజనసత్తా రాష్ట్ర కో-ఆర్డినేటర్ హనుమంతరావు, రాష్ట్ర ప్రతినిధి రాఘవయ్య, పాడేరు ఇన్‌ఛార్జి బాలన్నదొర, లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి ఝూన్సీ, మహిళాసత్తా జోనల్ కో-ఆర్డినేటర్ అనంతలక్ష్మి, జిల్లా కార్యదర్శి వేణు, జిల్లా ప్రతినిధి ఎల్.శివరామారావు, నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



**విశాఖపట్నం (టౌన్)**

**ప్రజా చైతన్యానికి 'సర్వజన సత్తా'**

అట్టడుగు వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి సర్వజన సత్తాను ఏర్పాటు చేసినట్టు ఆ విభాగం రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం సాయంత్రం వీజేఎఫ్

ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఈ నెల 7న సర్వజన సత్తాను ప్రారంభించారని ఆయన తెలిపారు. కొత్త తరానికి – కొత్త రాజకీయం అందించేందుకు సర్వజన సత్తాను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ నాయకుల వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. అరవై ఏళ్లుగా రాజ్యాంగబద్ధంగా ఎస్సీ,ఎస్టీ, బీసీలకు ఒరిగిందేమీ లేదన్నారు. 2014 నాటికి రాజ్యాంగ స్ఫూర్తితో, బడుగు బలహీన వర్గాల ఎదుగుదల కోసం దీర్ఘకాలిక ప్రణాళిక, ముందు చూపుతో తాము నిర్ణయం తీసుకుంటున్నామని తెలిపారు. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.డి. రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఝాన్సీ లక్ష్మీ, సర్వ జనసత్తా కో–కన్వీనర్లు హనుమంతరావు, బాలన్నదొర, రాఘవయ్య, సురేష్ పాల్గొన్నారు.

### విశాఖపట్నం రూరల్



### శ్రీకాకుళం రూరల్
### రాజకీయ లబ్ధికే కుల ప్రస్తావన

**ఆముదాలవలస :** ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయ లబ్ధికే కులప్రస్తావన వస్తోందని రాష్ట్ర సర్వ జనసత్తా కన్వీనర్ ఈద చెన్నయ్య అన్నారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో జరిగిన '60 వసంతాల రాజ్యాంగం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పరిస్థితుల' అవగాహన






సదస్సులో ఆయన మాట్లాడారు. గడిచిన 60 ఏళ్లుగా ప్రజలు దోపిడీకి గురవుతూ వంశపారంపర్య రాజకీయాలతో విసుగు చెందారన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల నాటికి లోక్‌సత్తా సంపూర్ణమైన ప్రజల పార్టీగా అవతరించనుందని, 2014 ఎన్నికల నాటికి తిరుగులేని పార్టీగా ఎదుగుతుందన్నారు. సమావేశంలో సర్వజనసత్తా కో–కన్వీనర్ పి.హనుమంతరావు, రాష్ట్ర సభ్యులు రాఘవయ్య, నియోజకవర్గ నాయకులు తమ్మినేని ఆనందనాయుడు, జిల్లా సభ్యులు పి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకాకుళం టౌన్

**మైనార్టీల స్థితిగతులపై అవగాహన సదస్సు**

ఇటీవల స్థానిక ఇలిసిపురంలో బి.ఆర్.అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి ప్రొ.విష్ణుమూర్తి అధ్యక్షతన '60ఏళ్ళ రాజ్యాంగం ఒసి, బిసి,ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీల స్థితిగతులపై అవగాహన సదస్సు' జరిగింది. ఈ సందర్భంగా సర్వజనసత్తా చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జి ఝాన్సీలక్ష్మీ రాష్ట్రంలో మొదటిసారిగా శ్రీకాకుళంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్వజనసత్తా రాష్ట్ర కన్వీనర్ ఈద చెన్నయ్య మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులు, విద్య, ఉద్యోగం, రాజకీయ, సామాజిక రంగాలలో అభివృద్ధి, వాటి అమలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, రాఘవయ్య, జిల్లా లోక్‌సత్తా అధ్యక్షులు కే. పోలినాయుడు, జిల్లా కార్యదర్శి వి. జగదీష్, మహిళాసత్తా అధ్యక్షురాలు వసంతలక్ష్మి, పంచాది రాంబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మనమింకా దారిద్ర్యరేఖ ఎగువనే ఉన్నామట
అందుకే ఉచితంగా ఇచ్చే ఇళ్ళు, మందులు, చదువు
మనకి రావట...!

# మహిళాసత్తా

## నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించండి




**రా**ష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటుతున్నా ప్రభుత్వం వాటిని నియంత్రించడానికి బదులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని మహిళాసత్తా నాయకులు ధ్వజమెత్తారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద జరిగిన ధర్నాలో పెరిగిన ధరలతో సామాన్యులు బతుకుబండినీడ్చడం కష్టంగా మారినా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని, ఫలితంగా మహిళలు, పిల్లలు పౌష్టికాహార లోపంతో, రక్తహీనత వంటి వాటితో బాధపడుతున్నారని రోగ నిరోధకశక్తిని కోల్పోయి రోగాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో ఏమీ కొనలేని పరిస్థితికి చేరుకున్నామని కనీసం కూరగాయలు, పచ్చడిమెతుకులకు కూడా నోచుకోలేని పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో ఉందని ఆరోపించారు. ఇప్పటికే నింగినంటిన ధరలకు తోడు పెట్రోఉత్పత్తుల ధరల పెంపువల్ల మరింత పెరిగే అవకాశం ఉందని, వెంటనే ధరలు తగ్గించి సామన్యుడికి అందుబాటులోకి తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 50 సంII లలో ఎన్నడూ లేని విధంగా ధరల పెరుగుదల రేటు ఉందని దీంతో దొంగతనాలు, దోపిడీలు పెరిగి అరాచకం కూడా ప్రబలిపోయిందని మహిళాసత్తా నాయకులు ఆరోపించారు. వేతనాలు పెంచడం ఎంత అవసరమో, నిత్యావసరాల ధరలను తగ్గించడమూ అంతే అవసరమని మహిళాసత్తా ప్రభుత్వానికి హితవు పలికింది. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ తరపున గ్రేటర్ హైదరాబాద్ మహిళాసత్తా ప్రెసిడెంట్ టి. పద్మజారాణి, కార్యదర్శి గజానని రాష్ట్ర మహిళాసత్తా నుండి ఎన్. సరోజాదేవి (అధ్యక్షురాలు), కె. గీతామూర్తి, సుజాత, ఎమ్.మహాలక్ష్మీ, మణిమంజరి, విమాలాదేవి, శారద, సుహసిని, రమణి, శైలజా, దాసరి రత్నం (రాష్ట్ర యువసత్తా అధ్యక్షుడు), మంగళ, నవీన్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ■

## పిల్లలు, మహిళలపై నేరాల్ని అరికట్టండి హోంమంత్రిని కలిసి విజ్ఞాపనపత్రం అందించిన మహిళాసత్తా



**రా**ష్ట్రంలో పిల్లలు, మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టటానికి ప్రస్తుత చట్టాల్ని సవరించటంతోపాటు పోలీసు సంస్కరణల్ని అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ మహిళావిభాగం 'మహిళాసత్తా' రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్. సరోజాదేవి, ప్రధాన కార్యదర్శి కె. గీతామూర్తి, రమాదేవి, మహాలక్ష్మి, జీహెచ్ఎంసీ అధ్యక్షురాలు టి. పద్మజారాణి, గజానని శుక్రవారం హోంమంత్రి పి. సబితా ఇంద్రారెడ్డిని సచివాలయంలోని ఆమె ఛాంబర్‌లో కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు.

ఇటీవల విజయవాడలో జరిగిన నాగవైష్ణవి పాశవిక హత్య, ఆ వేదనతో ఆ పాప తండ్రి హఠాన్మరణం, హంతకుల దాడిలో వారి కారు డ్రైవర్ కూడా చనిపోవడం యావత్ రాష్ట్ర ప్రజానీకాన్నీ కలచివేసిందని, అయితే కేవలం సానుభూతులకు, కన్నీళ్లకు పరిమితంకాకుండా వారి మరణాల్ని ఓ హెచ్చరికగా తీసుకుని వ్యవస్థలో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మహిళాసత్తా నేతలు మంత్రిని కోరారు. పిల్లల్ని, మహిళల్ని అపహరించిన నేరాల్ని హత్యానేరంతో సమానంగా, ఉరికి అర్హమైన నేరంగా భావించాలని, 2003లో జస్టిస్ మాలిమత్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల్ని, తర్వాత పోలీసువ్యవస్థ ప్రక్షాళనలో రెండవ పాలనాసంస్కరణల సంఘం చేసిన సూచనల్ని, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటం వల్లే రాష్ట్రంలో ఈరోజు నేరసంస్కృతి పెచ్చరిల్లిపోయిందని వారు అన్నారు. తమ పిల్లలు బైటికెళ్తే తిరిగొస్తారో లేదోనన్ ఆందోళనలో సమాజం గడపటంకంటే వైఫల్యం వ్యవస్థలో మరోటి ఉండదన్నారు. ఈ దిగువ చర్యల్ని తీసుకోవాలని హోంమంత్రిని మహిళాసత్తా కోరింది...

1. పిల్లలు, మహిళల అపహరణను హత్యానేరంతో సమానంగా, ఉరిశిక్షకు అర్హమైన నేరంగా పరిగణించాలి. 2. అలాంటి నేరాలు చేసేవారికి, వాటికి ప్రేరేపించేవారికి 90రోజుల్లో కఠినశిక్ష విధించాలి. 3. నేరపరిశోధనకు స్వయంప్రతిపత్తి కల్పించి రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా జరిగేలా చూడాలి. 4. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ కోసం ప్రభుత్వం ప్రధాన కేంద్రాలలో ల్యాబొరేటరీలను ఏర్పాటుచేయాలి. 5. తీవ్రమైన నేరాలలో స్వయంప్రతిపత్తి గల ప్రాసిక్యూషన్ ఉండాలి.

... ఈ సవరణల్ని అమల్లోకి తేవాల్సిన అవసరాన్ని హోంమంత్రి కూడా అంగీకరించారని వారు తెలిపారు. వీటిని తమ విభాగం నుంచి ప్రతిపాదనలుగా పంపుతామని హామీ ఇచ్చారని తెలిపారు. తక్షణ చర్యగా అన్ని జిల్లాల్లో మహిళా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు చేయటంతోపాటు నాగవైష్ణవి కేసు విషయంలో సత్వర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారన్నారు. ■

# యువసత్తా



## అవినీతిపై పోరాటానికి సహకరించాలి

ప్రజాప్రతినిధులను చట్టపరిధిలోకి తెచ్చే విధంగా అవినీతి నిరోధక చట్టాన్ని మార్చాలని లోక్‌సత్తా చేస్తున్న పోరాటానికి అన్ని పార్టీలు సహకరించాలని శ్రీకాకుళం జిల్లా యువసత్తా అధ్యక్షుడు పంచాది రాంబాబు కోరారు. ఆదివారం ఇక్కడ లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో యువసత్తా సభ్యులు, విద్యార్థులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవినీతి నిరోధక చట్టం-2009 మరింత పటిష్ఠం చేయాలన్నదే తమ పార్టీ ఉద్దేశమన్నారు. అన్నిస్థాయిల్లోనూ అవినీతిని అంతమొందించేందుకు 166వ న్యాయ కమిషన్‌లోని 2వ పాలనా సంస్కరణల 4వ నివేదిక సిఫార్సులను, సూచనలను పరిగణనలోకి తీసుకుని లోక్‌సత్తా ఈ కొత్తచట్టానికి రూపకల్పన చేసిందన్నారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పంచాయతీ, మున్సిపాలిటీ సభ్యులు కూడా చట్టం నియంత్రణలోకి వస్తారన్నారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక కోర్టు ఏర్పడుతుందని, అవినీతిపరులు ఏ స్థాయిలో ఉన్నా వారిపై కోర్టులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అవినీతి సాక్ష్యాలు దొరికినా, ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు రుజువైనా వారు తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు ఇప్పుడు అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, కానీ బిల్లు ఆమోదం పొందేందుకు సహకరించడం లేదన్నారు. ఇందులోని అంతర్యం ఏమిటో ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. ఈ బిల్లుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యావంతులు, యువతీ యువకులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల్ని చైతన్యపరిచి వారే ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చేలా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువసత్తా సభ్యులు పి.జ్యోతిప్రకాష్, సిహెచ్.చంద్రబోస్, వెంకటస్వామితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ■

## లోక్‌సత్తా వరదబాధిత సహాయచర్యల వివరాలు :: విరాళాల మొత్తం రూ. 71,11,633

2009 అక్టోబర్‌లో రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, కర్నూలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సంభవించిన వరదల్లో బాధితులను ఆదుకునేందుకు లోక్‌సత్తాకు మొత్తం రూ. 71,11,633 విరాళంగా వచ్చాయి. అందులో సహాయకార్యక్రమాలకు ఇప్పటివరకూ రూ. 14,68,941 వ్యయమైంది. (వ్యయంలో బియ్యం, పప్పుదినుసులు, పాత్రలు, దుస్తులు వంటి తక్షణసాయానికి రూ. 9,10,176, మహబూబ్‌నగర్ జిల్లా కేశవరం గ్రామంలో స్కూలు నిర్మాణానికి రూ. 2,75,000, కర్నూలు జిల్లా పూలతోట గ్రామంలో మంచినీటి ప్లాంట్ నిర్మాణానికి రూ. 2,83,765 ఖర్చయ్యాయి). "తాత్కాలిక సాయంతోపాటు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి మోడల్ గ్రామాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నాలుగు వరద బాధిత జిల్లాల్లో నాలుగు గ్రామాలను దత్తత తీసుకున్నాం. మిగిలిన విరాళాలను ఈ దిశగా వినియోగిస్తాం. గుంటూరు జిల్లాలో దత్తత తీసుకున్న వెంకట్రాజపాలెం (ఓలేరు మండలం)లో కమ్యూనిటీ హాలును నిర్మిస్తున్నాం. కృష్ణా జిల్లా దక్షిణ చిరువోలులంక (అవనిగడ్డ మండలం)లో ప్రభుత్వం-రైతుల భాగస్వామ్యంతో 650 ఎకరాలకు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటుచేయబోతున్నాం".

### రామకృష్ణ పరమహంస



జయంతి ఫిబ్రవరి 18

**"సామాన్యుడు అసంఖ్యాకంగా నీతులు వల్లిస్తాడు. కాని వాటిలో ఒక్కటి కూడా ఆచరించడు. జ్ఞాని తక్కువగా మాట్లాడతాడు. కానీ అతని జీవితమంతా నీతి నిండిన ఆచరణతో కూడి ఉంటుంది".**

### స్వామి దయానంద సరస్వతి




జయంతి ఫిబ్రవరి 12

**"ఇతరులకు వారిని వారిగా వుండగల స్వేచ్ఛను, ఎంతమేరకు మీరు ఇస్తారో, అంత మేరకే మీరు స్వేచ్ఛగా వుండగలరు".**

**" జ్ఞానమన్నది తప్పో ఒప్పో తెలియటం లో కాక తప్పు చేసినప్పుడు ఏం పోగొట్టుకుంటామో తెలియడం లో వుంటుంది".**

# నిర్దిష్ట ప్రణాళిక లేని ఉపాధి హామీ పథకం
# రాష్ట్రప్రభుత్వ అసమర్థతపై లోక్‌సత్తా ధ్వజం




రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలు మొదలై నాలుగేళ్లు దాటినా రాష్ట్రప్రభుత్వం ఇప్పటివరకూ దాని అమలులో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించలేకపోతోందని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది. ఈ పథకంపై మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

కేవలం ప్రభుత్వ అసమర్థత, బాధ్యతారాహిత్యం వల్ల సగానికిపైగా నిధులు మురిగిపోయే పరిస్థితి నెలకొనటం సిగ్గుచేటు. పేదలకు నేరుగా ఎంతోకొంత ఆసరానిచ్చే ఆ పథకం రాష్ట్రంలో కేవలం అనంతపురం, చిత్తూరు, విజయనగరం వంటి కొన్ని జిల్లాల్లో మాత్రమే వాస్తవంగా అమలవుతోంది. అక్కడ కూడా చాలాచోట్ల అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల నేతలు కుమ్మక్కయి అవకతవకలకు పాల్పడుతున్నారు.

జాతీయ ప్రభుత్వం నుంచి నేరుగా జిల్లాలకు వచ్చే ఈ నిధుల్లో పైస్థాయిలో కమీషన్లు నొక్కేసే అవకాశం తక్కువ కావటంతో రాష్ట్రప్రభుత్వం ఓపక్క ఆ పథకాన్ని గాలికొదిలేస్తుంటే, మరోవైపు అమలవుతువుతున్న కార్యక్రమాల్లో కూడా స్థానిక నేతలు అవినీతికి పాల్పడుతూ పేదలకు అందాల్సిన సాయానికి గండికొడుతున్నారు. పథకం అమలులో సామాజిక ఆడిటింగ్ నామమాత్రంగా జరుగుతోంది. అవకతవకల ఆరోపణల మీద విచారణ జరిపితే రాజకీయ దోషుల్ని వదిలేసి కేవలం పార్ట్‌టైంగా పనిచేసే ఫీల్డు అధికారిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దోషుల నుంచి డబ్బును తిరిగి స్వాధీనం చేసుకోవటానికి ఎటువంటి నిబంధనలు కూడా లేకపోవటంతో అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

పనుల అమలును పంచాయతీలకే కేటాయించాలనే మౌలికనిబంధనకు కూడా తూట్లు పొడిచి, స్థానిక నేతలు ఆ పనులను కూడా తమకు నచ్చినరీతిలో కేటాయింపచేసుకుంటూ అవసరమైన ఇతర పనులకు కేటాయించకుండా అడ్డుకుంటున్నారు. “ఉపాధి హామీ కార్డుల జారీ దగ్గర్నుంచి అవకతవకలు మొదలవుతున్నాయి. వేసిన రోడ్ల మీదే రోడ్లు వేసేస్తున్నారు. పనిచేయకుండానే చేసినట్టు చూపుతున్నారు. అధికారపక్షం, విపక్షం తేడా లేకుండా రాజకీయనాయకులు నిష్పత్తులవారీగా పంచుకుంటూ నిధుల్ని బొక్కేస్తున్నారు. అధికారులు యధావిధిగా భాగస్వాములవుతున్నారు’ అని లోపాలను ఎత్తిచూపింది. లోక్‌సత్తా

అలాగే ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను రాష్ట్రవ్యాప్తంగా అమలుచేసేందుకు ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణం చిత్తశుద్ధితో ప్రణాళికను రూపొందించాలి. రాజకీయాలకు అతీతంగా వీటి అమలు అధికారాన్ని పూర్తిగా పంచాయతీలకే అప్పచెప్పాలి. అక్రమాలకు పాల్పడ్డ వారి నుంచి సొమ్మును కక్కించేందుకు రెవిన్యూ రికవరీ చట్టాన్ని వర్తింపచేయాలి. అవినీతికి పాల్పడినవారు రాజకీయనాయకులైతే కఠినశిక్షతోపాటు ప్రజాజీవితం నుంచి బహిష్కారం ఉండాలి. ఈ లక్ష్యంతోనే లోక్‌సత్తా పార్టీ రూపొందించిన అవినీతి వ్యతిరేక బిల్లును రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి పాస్ చేయాలి. మరోవైపు, రాష్ట్రంలో అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎటువంటి ఆధారంలేకుండా నలిగిపోతున్న చేనేత కార్మికులకు ఈ పథకాన్ని వర్తింపచేసి వారిని ఆదుకోవాలి అని లోక్‌సత్తా తప ప్రకటనలో పలు సూచనలను కూడా చేసింది. ■

## శ్రీ కృష్ణ కమిటీని స్వాగతిస్తున్నాం

రాష్ట్రంలో నెలకొన్న సంక్షోభానికి బంద్‌లు, హింసాత్మక దాడులు, విద్వేషాలు పరిష్కారం కాదని... సంప్రదింపుల ద్వారా, సామరస్యంగా మాత్రమే పరిష్కారం సాధ్యమని, ఆ దిశగా జాతీయ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని లోక్‌సత్తా తొలి నుంచీ చెబుతోంది. అందులో భాగంగా భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని స్వాగతిస్తున్నామని కమిటీకి సారథ్యం వహిస్తున్న వ్యక్తులు నిష్ణాతులు, నిష్పాక్షికంగా వ్యవహరించేవారుగా పేరొందినవారని, వారు అందరినీ సంప్రదించి అందరి ఆకాంక్షల్నీ నెరవేర్చే విధంగా పరిష్కారాన్ని రూపొందిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపింది. రాష్ట్రంలోని అన్నివర్గాలూ చర్చల్లో పాల్గొని పట్టువిడుపులతో వ్యవహరిస్తూ కమిటీతో సహకరించాలని అపుడే సామరస్యరీతిలో పరిష్కారం సాధ్యమని తెలిపింది.

## సర్క్యులర్- 5/2010

### జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు, జిల్లా ఇన్‌ఛార్జిలకు,

ఈ నెల 1,2, తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన పార్టీ కోర్‌కమిటీ సమావేశంలో పార్టీకి సంబంధించి సభ్యత్వ కార్యక్రమము, మున్సిపల్ ఉద్యమం గురించి చర్చించి ఈ దిగువ నిర్ణయాలు చేయబడినవి.

**సభ్యత్వం :** మార్చి 31వ తేదీనాటికి ప్రతి నియోజక వర్గంలో కనీసం 50 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చేర్పించడానికి కృషిచేయాలని, అధిక సంఖ్యలో సాధారణ సభ్యత్వం చేయించాలని నిర్ణయించడమైనది. కావున మీరు వెంటనే సభ్యత్వ పుస్తకాల్ని **శ్రీ మాధవ్ 90001 23316** నుండి పొందవచ్చు.

**మున్సిపల్ ఉద్యమం, ఎన్నికలు....** రాష్ట్రంలో ఉన్న 109 మున్సిపాలిటీలు, 15 కార్పొరేషన్లలలో ఈ సంవత్సరం ఎన్నికలు జరుగనున్న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఖచ్చితంగా ఈ నెలలో పార్టీ శాఖల సమావేశములు ఏర్పాటు చేసి సభ్యత్వ కార్యక్రమము నిర్వహించి ఆయా శాఖలను బలోపేతం చేయడానికి కృషి చేయాలి. పార్టీ శాఖలు లేని చోట్ల వెంటనే ఏర్పాటు చేయాలి. వివరాలు వెంటనే మున్సిపల్ ఉద్యమాన్ని సమన్వయం చేస్తున్న **శ్రీ వై.డి.రామారావు పేరిట** మన ప్రధాన కార్యాలయానికి పంపించాలి.

**పట్టణ ప్రజా మ్యానిఫెస్టో....** మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో పార్టీ శాఖలు పటిష్టంగా ఉన్నచోట మార్చి నెలాఖరులోపుగా ఆయా పట్టణాలలోని ప్రజాహిత సంస్థలు, పన్ను చెల్లింపు దార్ల సంఘాలు, వినియోగదార్ల సంఘాలు, అపార్టుమెంటు, కాలనీ సంఘాలు, మేధావులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయా పట్టణ విస్తృత సమస్యలపై ఒక ప్రజా మ్యానిఫెస్టోను తయారుచేయాలి. రేపు జరిగే ఎన్నికలలో ఆయా పట్టణాల అభివృద్ధికి ప్రజల డిమాండ్‌గా ఆ మ్యానిఫెస్టో రూపొందాలి. మున్సిపల్ ఉద్యమానికి సంబంధించి సూచనలు, సలహాలకు వై.డి.రామారావు గారిని 98480 80867 నెంబరు ద్వారా సంప్రదించండి.

# కోర్ కమిటి సమావేశం

**మున్సిపల్ ఎన్నికలకు సన్నాహాలు:**

రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీని సిద్ధంచేసేందుకు వీలుగా జిల్లాకో సీనియర్‌నేతను ఇంచార్జిగా నియమించామని, సభ్యత్వ నమోదుకు లక్ష్యాల్ని నిర్ణయించామని పార్టీ తెలిపింది. దాంతోపాటు పార్టీ అనుబంధ విభాగాలైన మహిళాసత్తా, యువసత్తా, విద్యార్థిసత్తా, సర్వజనసత్తాలను బలోపేతం చేయటంతోపాటు ఉపాధ్యాయసత్తాను, కర్షక విభాగాన్ని ఏర్పాటుచేయాలని కోర్ కమిటీలో నిర్ణయించినట్టు తెలిపింది.

## రిజర్వేషన్ల బిల్లు రగడ - వెనుకబాటుతనం నిర్మూలనకు కృషి చేయాలన్న లోక్‌సత్తా

ముస్లింలలో వెనకబాటుతనాన్ని పోగొట్టాలనే చిత్తశుద్ధిలేకుండా, ఏదో రకంగా రిజర్వేషన్లపేరుతో వారిని మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలన్న హడావుడితో రాష్ట్రప్రభుత్వం వ్యవహరించటం వల్లే ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించిన చట్టంపై కోర్టు తీర్పు రగడ తలెత్తింది. ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనారిటీలలో వెనకబడినవారు అనేకమంది ఉన్నారు. మొత్తం రిజర్వేషన్లలో 50శాతానికి మించకూడదనే నిబంధనలకు లోబడి, బి.సి కేటగిరీలో వారికి రిజర్వేషన్ కల్పించవచ్చు. అయితే ప్రభుత్వం సమగ్రంగా, చిత్తశుద్ధితో పరిశీలించి ఆ కేటగిరీకి చెందినవారికి రిజర్వేషన్లు కల్పించకపోవటం వల్లే అస్పష్ట, సంక్షోభ పరిస్థితి ఎదురైంది. 2005లో ఒకసారి సుప్రీంకోర్టులో చేతులు కాల్చుకున్నాక కూడా అధికారపార్టీ బుద్ధితెచ్చుకుని శాస్త్రీయమైన రీతిలో వ్యవహరించకపోవటం వల్లే 2007లో కల్పించిన రిజర్వేషన్లను కూడా కోర్టు తిప్పికొట్టింది. ప్రభుత్వ ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల ఆ కోటా కింద 2007 నుంచి కళాశాలల్లో సీట్లు తెచ్చుకున్న విద్యార్థులు, ఉద్యోగాలు పొందిన ముస్లిం యువత పరిస్థితి అయోమయంలో పడింది.

ఇంతకు ముందు కూడా సాధ్యాసాధ్యాలతో, సుప్రీంకోర్టు తీర్పుతో నిమిత్తం లేకుండా కొన్ని కులాలను వెనకబడిన వర్గాలుగా ప్రకటిస్తానని బూటకపు హామీల్ని అధికారపార్టీతోపాటు ప్రధాన సంప్రదాయ పార్టీలన్నీ చేశాయి. అటువంటి పార్టీలవల్లే సమాజంలో విభేదాలు తీవ్రతరమవుతున్నాయి. పరిమిత ఫలితాలనిచ్చే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయం చేస్తూ కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టే ధోరణికి ప్రభుత్వం ఇప్పటికైనా స్వస్తిచెప్పి వెనకబాటుతనాన్ని శాశ్వతంగా తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయత్నించాలి. రిజర్వేషన్ల వల్ల కేవలం 4-5శాతానికి మాత్రమే ఫలాలు అందుతున్నాయి. 90శాతానికిపైగా అర్హులకు రిజర్వేషన్లు అందుకునే అవకాశం, శక్తి కూడా లేదు. పూర్తిగా తన పరిధిలో ఉన్న ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టే బాధ్యతను ప్రభుత్వం విస్మరించింది. ముస్లింలతోపాటు ఇతరవర్గాల్లో వెనకబాటుతనాన్ని శాశ్వతంగా తొలగించేందుకు వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను ఉచితంగా కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి. "రిజర్వేషన్ల వల్ల సంపన్నులై, హోదాలు పొందినవారు తిరిగి రిజర్వేషన్లను సొంతం చేసుకోకుండా ఆ కులాల్లోని, వర్గాల్లోని పేదలకే దక్కేలా తగిన ప్రాతిపదికను రూపొందించాలి. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా 12వ తరగతి వరకూ పిల్లలందరికీ ఒకే ప్రమాణాల ఇంగ్లీషు, కంప్యూటర్ విద్యను ఉచితంగా అందించే ఏర్పాటుచేయటంతోపాటు... ఉన్నత చదువులకు వెళ్లే పేదపిల్లలకూ ప్రభుత్వమే విధిగా తోడ్పాటునందించాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకీ, పట్టణ పేదల పిల్లలకీ కులం, మతంతో ప్రమేయంలేకుండా పోటీపరీక్షల్లో 10శాతం మార్కుల్ని అదనంగా కలపాలి... తద్వారా అన్నికులాల్లో, మతాల్లో వెనకబాటుతనాన్ని తొలగించి అందరికీ ఎదిగే అవకాశాలు అందించినట్టు అవుతుంది.

## కాంగ్రెస్ తెలుగుదేశం నాటకీయ అరుపులు మాని అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలి –ప్రభుత్వానికి లోక్‌సత్తా డిమాండ్

వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారంటూ కేవీపీ రామచంద్రరావు, చంద్రబాబు నాయుడు సహా కాంగ్రెస్, తెలుగుదేశం నేతలు పరస్పరం మరోమారు ఆరోపించుకుంటున్న నేపథ్యంలో వాస్తవాలు బైటపడి దోషులకు తగిన శిక్ష పడి ప్రజాధనాన్ని కాపాడాలంటే అవినీతి నిరోధక చట్టాన్ని సవరించే బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రభుత్వం ప్రవేశపెట్టాలి. ఒకరి అవినీతిపై ఇంకొకరు అరుపులతో ఆరోపించుకుంటూ హడావుడి సృష్టిస్తున్న ప్రధాన స్రవంతి రాజకీయపార్టీలు... ఆ అవినీతిని అరికట్టే పటిష్ట యంత్రాంగాన్ని సృష్టించేందుకు చేస్తున్న కృషిని అడ్డుకోవటంలో మాత్రం కుమ్మక్కయి, లాలూచీతో వ్యవహరిస్తున్నాయి.

అవినీతి సమస్యను నిర్మూలించటానికి ఏమాత్రం సహకరించకుండా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కుమ్మక్కయి జాగ్రత్త పడుతున్నాయి. పైకి మాత్రం ఒకరి అవినీతిని ఇంకొకరు వెలికితీస్తూ పోరుచేస్తున్నట్టు హడావుడి సృష్టిస్తూ నాటకమాడుతున్నాయి. వ్యవస్థను పీల్చిపిప్పిచేస్తున్న అవినీతిపై మాటలతోకాకుండా చేతల్లో పోరాడేందుకు తగిన పకడ్బందీ ఏర్పాట్లున్న అవినీతి నిరోధక బిల్లును లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రూపొందించి అన్ని పార్టీలకూ అందచేసి అసెంబ్లీలో ఆమోదానికి వారి సహకారం కోరినా, కాంగ్రెస్, టీడీపీ ఏమాత్రం స్పందించలేదు. ఆ బిల్లు ప్రకారం పార్లమెంటు, శాసనసభ సభ్యులందరితోపాటు పంచాయతీల్లో, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికైనవారు కూడా అవినీతి నిరోధక చట్టంకింద ప్రజాసేవకుల పరిధిలోకి వస్తారు.

రాజకీయనేతలతోపాటు ఉన్నతాధికారుల మీద కూడా పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు పరంపరగా వస్తునాయి. వారి మీద అడపాదడపా దాడులు జరుపుతున్నా, హడావుడితప్ప పూర్తిస్థాయి చర్యలే లేవు. పెద్దచేపల మీద చర్యలు తీసుకోకుండా ఏసీబీని (అవినీతి నిరోధక విభాగాన్ని) రాజకీయ పెద్దలు అడ్డుకుంటున్నారు. వక్ఫ్ భూముల్లో పెద్దఎత్తున కబ్జాలు జరిగాయని కూడా తాజా నివేదికలు స్పష్టంచేస్తున్నాయి. కులం, మతం, ప్రాంతంతో సంబంధంలేకుండా తమ సొంతవర్గాల్నే ఆయా నేతలు దోచుకుతింటూ రాష్ట్రాన్ని కబళిస్తున్న తరుణంలో అవినీతి నిరోధక చట్టాన్ని సవరించి పూర్తిస్థాయిలో బలోపేతం చేయాల్సి ఉంది.

## రాష్ట్రంలో వాస్తవాలు తెలిపేందుకు... జిల్లాల వారీ కేటాయింపులపై ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించాలి లోక్‌సత్తా డిమాండ్

రాష్ట్రంలో రెండు ప్రాంతాల మధ్య విద్వేషాలు రగులుతూ నెలలు తరబడి సంక్షోభం కొనసాగుతున్నా, అభివృద్ధి కుంటుబడుతున్నా ప్రజల్లో అపోహల్ని తొలగించి సామరస్యాన్ని నెలకొల్పేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నించ లేదు. ఎవరెవరో ఏదోదో చెబుతుంటే ప్రజలు నమ్మేస్తూ గందరగోళానికి గురవుతూ సాటివారిపై ద్వేషాన్ని పెంచుకుంటుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్రాంతాల వారీగా విద్య, ఆరోగ్యం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి, నీటివనరుల వినియోగం, వ్యవసాయ నిధులు, విద్యుత్ తదితర రంగాల్లో కేటాయింపులపై, అభివృద్ధిపై రాష్ట్రం ఏర్పడినినాటి నుంచీ శ్వేతపత్రాన్ని ప్రకటించాలి. ప్రాంతాలవారీతోపాటు జిల్లాలవారీగా ఏ రంగానికి ఎంతెంత కేటాయించిందీ కూడా వివరంగా వెల్లడించాలి. అలాగే 1973కు ముందు జిల్లాకౌన్సిళ్ల విధానం వల్ల జిల్లాలవారీ బడ్జెట్ ఉండేది. దాన్ని తక్షణం పునరుద్ధరించి జిల్లాలవారీగా నిధుల్ని కేటాయించాలి. జిల్లాలను మూడోఅంచె ప్రభుత్వంగా గుర్తించటం ద్వారా వెనకబాటుతనాన్ని నిర్మూలించటానికి అధికార వికేంద్రీకరణకు ఇప్పటికైనా ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి.

మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా పూర్తిగా అధ్వాన్నస్థితిలో ఉంది. ప్రస్తుత ఆర్థికస్థితిగతుల వివరాల్ని కూడా శ్వేతపత్రంలో పేర్కొనాలి.

## ఓయూ ఘటనలపై విచారణను వేగంగా పూర్తిచేసి దోషులపై చర్యలు తీసుకోవాలి

రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణపై ప్రభుత్వానికి నిర్దిష్ట విధానమున్నట్టు కన్పించటం లేదు. అందువల్లే ఆందోళనలు జరుగుతున్నప్పుడు పోలీసులు ఒకోసారి పూర్తి ఉదాసీనంగా, ఇంకోసారి అత్యుత్సాహంతో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వానికి ఒక స్పష్టత, పద్ధతి లేకపోవటం వల్లే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వరుసగా హింసాత్మక ఘటనలు, లాఠీఛార్జీలు జరుగుతున్నాయి. ఓయూలో పదే పదే విద్యార్థులు, మీడియా సిబ్బంది గాయపడటం తీవ్ర విచారకరం. పరీక్షల తరుణంలో ఇలాంటి ఘటనలు జరగటం వల్ల విద్యార్థులు కెరీర్‌ను సైతం నష్టపోతారు. దాన్ని నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి. విద్యార్థులు ముందు తమ పరీక్షల మీద దృష్టి పెట్టి శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా తమ భావాలను, ఆందోళనను వ్యక్తం చేయాలి. ఓయూ లాఠీచార్జిపై విచారణను వేగంగా పూర్తిచేసి దోషులపై చర్యలు తీసుకోవాలి.

**అవినీతి రాజకీయాన్ని అంతం చేద్దాం... ప్రజల బతుకుల్లో వెలుగు నింపుదాం**

# లోక్‌సత్తా పార్టీ జిల్లాల సమాచారం



### చిత్తూరు

**కలుషితమౌతున్న రాజకీయాలు**

నేటి రాజకీయాలు కలుషితమయ్యాయని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు జయకుమార్, జిల్లా ఇంఛార్జి గాంధీలు అన్నారు. లోక్‌సత్తా కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీరు మాట్లాడుతూ సమాజంలో రాజకీయ పార్టీలు విలువల్ని పాటించకుండా వ్యాపార దృక్పథంతో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో పంచాయతీ సర్పంచ్‌ను గెలిపించుకోవడానికి 10 లక్షల రూపాయల దాకా ఖర్చు పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఎంఎల్ఏగా పోటీ చేసేవారు 10 నుండి 20 కోట్ల దాకా ఖర్చుపెడుతున్నారని గెలిచిన అనంతరం ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడానికి కమిటీలు ఏర్పాటుచేసి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి, పలమనేరు, మదనపల్లి, తదితర ప్రాంతాల నుండి నేతలు వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున, వెంకటాచలం, సుబ్రమణ్యం, కేశవులశెట్టి తదితరులు పాల్గొన్నారు.

### విజయవాడ అర్బన్ జిల్లా

**విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయొద్దు - లోక్‌సత్తా**

లోక్‌సత్తా పార్టీ అర్బన్ జిల్లా 30వ డివిజన్ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ వన్‌టౌన్ కోమలవిలాస్ సెంటర్‌లో భోగవల్లి అప్పారావు సత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన అర్బన్ అధ్యక్షులు చుండూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు ఒకరిపై ఒకరు పెత్తనం ఎలా సంపాదించాలనే ప్రయత్నంలో ప్రజలు మధ్యలో నలిగిపోతున్నారని, శ్రీకృష్ణ కమిటీని రెండు పార్టీల్లో చెరోవర్గం వ్యతిరేకిస్తూ, రాష్ట్రంలో రాజకీయ సంక్షోభానికి కారకులవుతున్నారని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మే వరకు ఎటువంటి ఆందోళనలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసే పరిస్థితిని కల్పించాలని అన్నారు. త్వరలో నగరంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలపై తగు ప్రణాళికను





రూపొందిస్తున్నామని అన్నారు.

అర్బన్ కార్యదర్శి వి. రాజామణి మాట్లాడుతూ "నగరంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా పార్టీకి తెలియచేస్తే తక్షణం స్పందిస్తామని" అన్నారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ నాయకులు పిళ్ళా గురుప్రసాద్ నిర్వహించారు. పార్టీనగర కార్యదర్శులు బండ్లమూడి మురళీకృష్ణ, కోట శ్రీనివాసరావు, యువసత్తా నాయకులు కళ్యాణం విజయకుమార్, కోసూరి షణ్ముఖ కుమార్, మహిళా సత్తా నాయకురాలు నళిని మరియు దంతనాల జగన్మోహనరావు, ముత్యాల రావు, మారుతీ మోహన్‌రావు తదితర నాయకులు కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లా , విజయవాడ

# వైష్ణవి హంతకులను త్వరగా శిక్షించాలి







చిన్నారి నాగవైష్ణవిని అతి కిరాతకంగా హత్య చేసిన వారికి త్వరితగతిన శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బెంజిసర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ డీవీ మానర్, చెన్నుపాటి పెట్రోల్ బంకు మీదుగా స్వరాజ్య మైదానం సిగ్నల్ వరకు సాగింది. అక్కడ నుంచి పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం అందజేశారు. ర్యాలీలో లోక్‌సత్తా పార్టీ నేతలు, విద్యార్థులు వైష్ణవి హంతకులను శిక్షించాలని నినాదాలు చేస్తూ ప్లకార్డులు చేతబట్టి ర్యాలీగా వెళ్లారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు చుందూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నగరంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు భయాందోళనలు కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోషులను వెంటనే శిక్షించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పట్టాభిరామయ్య మాట్లాడుతూ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు సవరణలు చేసి దానిని మరింత శక్తిమంతం చేయాలని దోషులు తప్పించుకోకుండా చూడాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ మహిళలకు, చిన్నారులకు గట్టి రక్షణ కల్పించాలన్నారు. అర్బన్ ప్రధాన కార్యదర్శి రాజమణి, లలిత సుధ, విజయలక్ష్మి, గాంధీ, రఘురామ్, ముత్యాలరావు, కెనడీ స్కూలు విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

## కడప జిల్లా

# పార్టీ జిల్లా కార్యాలయం, పౌర సేవాకేంద్రం ప్రారంభం






లోక్‌సత్తా పార్టీ నూతన జిల్లా కార్యాలయం ఫిబ్రవరి 14న కడపలో ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా టి.ఆర్. జగన్నాథరెడ్డి మరియు జిల్లా అధ్యక్షులు పయ్యావుల వేణుగోపాల్ పాల్గొన్నారు.

పౌరసేవా కేంద్రం ప్రారంభోత్సవంలో సి. జగన్ మోహన్ రాజు మరియు జిల్లా మహిళాసత్తా అధ్యక్షురాలు వి.విజయమ్మ, కోట విజయలక్ష్మి, పట్టణబాధ్యులు బి. శేషారెడ్డి, దేవరశ్రీ కృష్ణ, నజీంమున్నీసా, విద్యార్థిసత్తా నాయకులు కె.రామచంద్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**విజయనగరం, గజపతినగరం**

**ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు పోస్టుకార్డు ఉద్యమం**

స్థానిక రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవర ఈశ్వరరావు మాట్లాడుతూ గజపతినగరం రైల్వేస్టేషన్ మీదుగా నడుస్తున్న నాగావళి, బోకోరో,, బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని కోరుతూ ఎనిమిది సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు వినతిపత్రాలు అందజేసినా రైల్వే శాఖాధికారులు స్పందించడం లేదని అన్నారు. ఇటీవల ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మికి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు సంయుక్తంగా వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇదే సమయంలో ఈ విషయమై రైల్వే మంత్రి మమతా బెనర్జీకి ఆ శాఖకు చెందిన జనరల్ మేనేజర్, విశాఖపట్నంలో గల డీఆర్‌ఎంకు పోస్టుకార్డుల ద్వారా తెలియజేయాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.ఎస్.వర్మ, జోగారావు, మహిళాసత్తా అధ్యక్షురాలు మండపాక భారతి, అట్టాడ ఆదినారాయణ్, నేతేటి సత్యనారాయణ, తౌడు తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం, గజపతినగరం**

**పర్యవేక్షణ లోపం విద్యాభివృద్ధికి శాపం**

ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు దిగజారడానికి పర్యవేక్షణ లోపమే కారణమని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు దేవర ఈశ్వరరావు ఆరోపించారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తాము నియోజకవర్గం పరిధిలో గల పలు గ్రామాలలోని పాఠశాలలను పరిశీలించగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాలలను తరచూ తనిఖీలు జరపనందున నాణ్యమైన విద్యను అందించే సత్తా గల ఉపాధ్యాయులు ఉన్నా, విద్యా ప్రమాణాలు మెరుగు పడడం లేదన్నారు.లోగిశ, జిన్నాం, మధుపాడ, గింజేరు, దేవుపల్లి తదితర గ్రామాలలో గల పాఠశాలలను పరిశీలించినట్లు చెప్పారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఆహ్లాదకర వాతావరణం ఉండాలన్నారు. మంచినీరు, మరుగు దొడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పలు పాఠశాలలలో కట్టెల పొయ్యిలపై మధ్యాహ్న భోజనం వండుతున్నారని, కానీ గ్యాస్ పొయ్యిలుపై వంటలు చేయాల్సి ఉందన్నారు. గ్యాస్ సకాలంలో సరఫరా కావడం లేదని భోజన నిర్వాహకులు అంటుండగా బుక్ చేసిన రెండు రోజులలోనే సరఫరా చేస్తున్నట్లు గ్యాస్ ఏజెన్సీ వారు అంటున్నారని చెప్పారు. ఈ సమస్యలకు పర్యవేక్షణ లోపమే కారణమని ఆయన విమర్శించారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ మండలశాఖ అధ్యక్షులు వి.ఎస్.ఆర్. జోగారావు తదితరులు పాల్గొన్నారు.



**విజయనగరం (టౌన్)**

**కలుషితమౌతున్న రాజకీయాలు**

తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన కల్తీసారా ఘటనకు ఆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ బాధ్యత వహించి రాజీనామా చేయాలని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీసారా తాగటంతో 13 మంది మృత్యువాత పడ్డారని దీనికి బాధ్యత వహిస్తూ ఆ జిల్లా మంత్రులు విశ్వరూప్, పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు కూడా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేసారు. కల్తీసారా ఘటన అత్యంత విషాదకరమని ఆయన అన్నారు. ప్రభుత్వం మద్యం పై వచ్చే ఆదాయంపై ఆధారపడడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. జరిగిన దారుణానికి ప్రభుత్వం బాధ్యత వహించకుండా ఎక్సైజ్ అధికారులను సస్పెండ్ చేయుటం విడ్డూరమన్నారు.ప్రభుత్వమే ఆదాయం కోసం ప్రజలను తాగుబోతులుగా తయారుచేసి ధరలు పెంచి, కల్తీ మద్యం వైపు ప్రయాణం చేయిస్తుందన్నారు. 13 వేల కోట్ల రూపాయలతో ప్రజలను తాగుబోతులుగా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, పార్టీ మహిళాసత్తా అధ్యక్షురాలు ఐ.అనంతలక్ష్మి అన్నారు. ఈ సమావేశంలో శివరామారావు, పార్టీ జిల్లా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

## సూచన

**మీ జిల్లాలో లోక్‌సత్తా పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తదితర సమాచారాన్ని తప్పనిసరిగా ఫొటోలతో పాటు ప్రతినెలా 10వ, 25వ తేదీల్లోగా పంపించండి. వీలువెంబడి వాటిని వరుసగా ప్రచురిస్తాం. స్థానికంగా మీ కార్యక్రమాల్ని రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోండి.**

**వివిధ అంశాలపై మీరడిగే ప్రశ్నలకు డా॥ జేపీ సమాధానాలిస్తారు. ప్రచురించబడిన ప్రతి ప్రశ్నకు రూ॥ 100/- పారితోషికం ఇవ్వబడును**



## ఉరి-శిక్ష పడిన సందర్భంగా మిత్రులతో భగత్‌సింగ్

"స్నేహితులారా!

విడిపోవడం, కలుసుకోవడం అనేవి జీవితంలో భాగం. బహుశా మళ్ళీ మనం కలువవచ్చు. మీ వంతు శిక్ష మీరు పూర్తి చేసిన పిదప ఇంటికి తిరిగి వెళ్ళిన తరువాత ప్రాపంచిక విషయాల్లో మునిగిపోకండి. బ్రిటీష్‌వారిని పారద్రోలి సామ్యవాద గణతంత్ర భారతాన్ని ఆవిష్కరించే వరకు విశ్రమించకండి. ఇదే మీకు నేనిచ్చే చివరి సందేశం"

## సహచరుడు బటుకేశ్వర్‌దత్‌కి వ్రాసిన ఉత్తరంలో

"మిత్రమా !

నీకు జీవితఖైదు పడిందని తెలిసింది.
నాకు ఉరి-శిక్ష విధించారు. నేను కోరుకున్నది కూడా అదే.
ప్రస్తుత పరిస్థితుల్లో నా ఉరి మన స్వాతంత్ర్య
పోరాటానికి అవసరమయిన ఉత్ప్రేరకంగా పని
చేస్తుందని భావిస్తున్నారు."



భగత్‌సింగ్ బలిదానం భరతమాత దాస్యవిముక్తికా లేక
ఎర్ర దొరల క్రూర పాలన నుండి నల్ల దొరల అవినీతి
పాలనలో మగ్గటానికా?



ఆలోచించండి!

23 ఏళ్ళ యవ్వన ప్రాయంలో భగత్‌సింగ్ లాంటి
ఎందరో త్యాగధనుల బలిదాన ఫలితమే మన స్వతంత్ర భారతం
అటువంటి ఈ పవిత్ర దేశంలో అవినీతి
దావానలంలా వ్యాపించి మనందరి జీవితాల్ని కాల్చివేస్తోంది.

రండి!


క్రొత్త రాజకీయంతో అవినీతిని పారద్రోలుదాం.
స్వచ్ఛమైన రెండో గణతంత్ర భారతంవైపు అడుగులు వేద్దాం.

అందుకే.....

మనచేత.......మనకోసం.......

లోక్‌సత్తా పార్టీ

RNI.Ref. No. Nil-1/10/2009, Verification Date: 27/11/2009




Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, for and on behalf of Foundation for Democratic Reforms, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 0082, and printed at Kala Jyothi Pvt., Ltd., 1-1-60/5, RTC "X" Roads, Hyderabad